ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -308 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 23 ఫిబ్రవరి 2026

## ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ
# హైస్పీడ్ ఇంటర్నెట్

### గ్రామీణ కనెక్టివిటీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం

**5 లక్షల ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యంగా అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్**

**గత ప్రభుత్వం ఫైబర్ నెట్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని చంద్రబాబు విమర్శ**

**టెక్నాలజీ ప్రయోగాలకు ఏపీని టెస్ట్ బెడ్‌గా మారుస్తామన్న ముఖ్యమంత్రి**

**అమరావతి ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్) -** రానున్న ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకెళ్లాలంటే డిజిటల్ కనెక్టివిటీ అత్యంత కీలకమని ఆయన అన్నారు. మిగతా 2లో...




## కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతికంగా
# దివాలా తీసింది

**యూత్ కాంగ్రెస్ షర్ట్ లెస్ నిరసనపై తీవ్రస్థాయిలో స్పందించిన ప్రధాని మోదీ**

**ఏఐ సదస్సులో కాంగ్రెస్ నగ్న రాజకీయాలు చేసిందన్న ప్రధాని**

**కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతికంగా దివాలా తీసిందని విమర్శ**

**విదేశీ అతిథుల ముందు దేశం పరువు తీశారని ఫైర్**

**కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమి భాగస్వాములకు మోదీ ధన్యవాదాలు**

**ఢిల్లీ ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్) -** ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో జరిగిన 'ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోనే అత్యంత పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ సైద్ధాంతికంగా దివాలా తీసిందని ఈ ఘటన స్పష్టం చేస్తోందని ఆదివారం మీరట్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో విమర్శించారు.కొద్ది రోజుల క్రితం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి మిగతా 2లో...



# లొంగిపోయిన మావోయిస్టు పార్టీ కార్యదర్శి దేవ్‌జీ!

**మరో అగ్రనేత మల్లా రాజిరెడ్డితో పాటు 20 మంది మావోయిస్టులు కూడా..**
**తెలంగాణ పోలీసుల ముందు సరెండర్**
**నేడో, రేపో ప్రకటించనున్న డీజీపీ**


2లో.

# ఐఎన్ఎస్ అరిదమన్...
## భారత్ అమ్ములపొదిలో శత్రుభీకర అస్త్రం

**ఏప్రిల్-మే నాటికి భారత నావికాదళంలోకి చేరనున్న అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిదమన్**

**ఇప్పటికే ఉన్న అరిహంత్, అరిఘాత్ కంటే పెద్దది, ఎక్కువ క్షిపణులను మోసుకెళ్లగలదు**

**శత్రు రాడార్లకు చిక్కని అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీ, తక్కువ శబ్దం చేసే రియాక్టర్ దీని సొంతం**


2లో.



# నీటి హక్కులపై రాజీ లేదు

**దేవాదుల భూసేకరణకు రూ.600 కోట్లు**

**మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను గాలికొదలం**

**రాష్ట్రంపై రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారం**

**చాలా గొప్పగా మేడారం నిర్వహణ : సీఎం రేవంత్‌రెడ్డి**

**వరంగల్ / ములుగు ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్) -** దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణకు రూ.600 కోట్లను కేటాయించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్దనున్న దేవాదుల ప్రాజెక్టు ఇన్‌టేక్‌వెల్‌ను సీఎం సందర్శించారు. అనంతరం ప్రాజెక్టు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగతా 2లో...

# మూసీ బాధితులకు అండగా ఉంటాం..

**సీఎం రేవంత్ ప్రతి అడుగు వెనుక భూకబ్జాలే..**

**మూసీ శుద్ధి పేరుతో పేదల ఇళ్లు కూలుస్తారా?: హరీశ్**

**మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులతో బీఆర్ఎస్, బీజేపీ నేతల వేర్వేరు భేటీలు**




హైదరాబాద్, **ఫిబ్రవరి 22 - (రిపబ్లిక్ న్యూస్) -** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేసే ప్రతి అడుగు వెనుక భూముల కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉంటుందని మాజీ మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లు కూల్చి బడా కాంట్రాక్టర్లకు భూములు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోతున్న గండిపేట

# లడ్డూ వ్యవహారంలో డైవర్షన్ పాలిటిక్స్ : భూమన

**లడ్డూ వివాదంలో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసీపీ ఆరోపణ**

**ఏకసభ్య కమిటీ వేయడం సుప్రీంకోర్టును అవమానించడమేనన్న భూమన**

**తప్పుడు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ కమిటీ అని విమర్శ**




తిరుపతి లడ్డూ వివాదంలో తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని, దారి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతోందని వైసీపీ విమర్శించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలను, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అవకతవకలను ఎండగట్టడంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. 2లో...

# రాంచందర్‌రావు అరెస్టు

**ఇంటి వద్దే ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు..**

**ఈటల, ఏలేటి గృహ నిర్బంధం**

**కాంగ్రెస్, మజ్లిస్‌పై రాంచందర్‌రావు ఆగ్రహం**

**అసద్ చెప్పుచేతల్లో సర్కారు ఉందని విమర్శ**

హైదరాబాద్/**ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్) -** కామారెడ్డిలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఘర్షణ వాతావరణం.. బాన్సువాడలో రెండు వర్గాల మధ్య హింసాత్మక ఘటనలు చెలరేగిన నేపథ్యంలో ఆదివారం చలో కామారెడ్డి, మిగతా 2లో...



# చంద్రబాబు, జగన్‌లు బీజేపీకి బానిసలు

**మోదీ చైనా రోబోను ప్రదర్శించినప్పుడు వీరి నోళ్లు పెగల్లేదని ఎద్దేవా**

**చంద్రబాబుది అధికారిక పొత్తు కాగా, జగన్‌ది బీజేపీతో అక్రమ పొత్తు అని ఆరోపణ**

**రైతుల కోసం కాంగ్రెస్ నిరసన చేస్తుంటే ఉగ్రకోణం అంటారా అని ఫైర్**

**ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్) -** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి 2లో...



# కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతికంగా దివాలా తీసింది

మొదటిపేజీ తరువాయి

అంశాలపై యూత్ కాంగ్రెస్ సభ్యులు ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ ఘటనపై మోదీ స్పందిస్తూ, "భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రజలు కష్టపడుతుంటే, దేశ ప్రగతిని కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ సదస్సును భారత్ నిర్వహించడం ప్రతి ఒక్కరికీ గర్వకారణం. కానీ కాంగ్రెస్ ఈ ప్రపంచ వేదికను తమ నీచ, నగ్న రాజకీయాలకు వాడుకుంది" అని అన్నారు."విదేశీ అతిథుల ముందు కాంగ్రెస్ నేతలు నగ్నంగా నిలబడ్డారు. అసలు మీ నగ్నత్వం దేశానికి ఇప్పటికే తెలుసు, మళ్లీ కొత్తగా బట్టలు విప్పాల్సిన అవసరం ఏముంది?" అని ప్రధాని ప్రశ్నించారు. సొంత దేశం పరువు తీయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు తన సమాధి తవ్వాలని చూడటం, తన తల్లిని దూషించడం వంటివి చేస్తున్నారని, అయితే దేశ ప్రతిష్ఠకు సంబంధించిన కార్యక్రమంలో ఇలా ప్రవర్తించడం హద్దులు మీరడమేనని అన్నారు.దేశం పరువు తీసిన వారిని విమర్శించాల్సింది పోయి, కాంగ్రెస్ అగ్రనేతలు ఆ నిరసనకారులను ప్రశంసించడం దురదృష్టకరమని మోదీ వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఘటనపై కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఏఐ సదస్సులో ఆ రెండు అవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయి : 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల ముగిసిన 'ఏఐ ఇంపాక్ట్' సదస్సుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. దీని ద్వారా కృత్రిమ మేధ రంగంలో భారతదేశ అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామని అన్నారు. ఆదివారం 131వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రపంచ దేశాలను ఆకర్షించిందని అన్నారు.

ఈ సదస్సులో ముఖ్యంగా మన రెండు ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని తెలిపారు. జంతువుల చికిత్సకు వాటిని ట్రాక్ చేయడానికి 'ఏఐ'ని ఉపయోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని అన్నారు. నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్ రంగాలకు చెందిన వారు ఈ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు.

కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధన, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన యువత ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని అన్నారు. ఈ సదస్సు ద్వారా మన యువత ప్రతిభను ప్రపంచానికి చూపించగలిగామని అన్నారు.

**సైబర్ నేరాలపై హెచ్చరిక**

సైబర్ నేరాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

కాగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను ప్రధాని మోదీ ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. వారి నిర్ణయం నలుగురికి జీవనదాతగా మారిందని పేర్కొన్నారు.

# నీటి హక్కులపై రాజీ లేదు

మొదటిపేజీ తరువాయి

భూసేకరణ జాప్యంతో ప్రాజెక్టులు ఆపడానికి వీలులేదన్నారు. అన్ని ప్రాజెక్టుల భూసేకరణకు ప్రత్యేక కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

దేవాదుల ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి అన్ని అంచనాలను ప్రభుత్వం ముందుకు బడ్జెట్ సమావేశాలకు ముందే తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. మార్చిలో మంత్రివర్గ సమావేశంలో అన్ని అంచనాలకు ఆమోదం తెలుపనున్నట్టు స్పష్టం చేశారు. నెలలోపు దేవాదుల పంపుల మరమ్మతులను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. రామప్ప చెరువు నుంచి జంపన్నవాగుకు నీరందించే ప్రణాళికపై వెంటనే నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండేండ్లలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికే ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు.

బడ్జెట్ సమావేశాల అనంతరం గోదావరి జలాలపై ముఖాముఖి చర్చ పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు సీఎం తెలిపారు. ఈ వివాదాలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని, మా తప్పులు ఏంటో, మీ తప్పులు ఏంటో చర్చిద్దామని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి అన్నారు. మీది పదేండ్ల అనుభవమని, మాది రెండేండ్ల అనుభవమని, ఎవరేం చేశారో పూర్తిస్థాయి చర్చ చేద్దామని చెప్పారు. ఆరోపణలు చేస్తే అతికేట్టు ఉండాలని, చవకబారు ఆరోపణలు, విమర్శలు చేయొద్దని కేసీఆర్, హరీశ్‌రావుకు సీఎం సూచించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన సూచనలను రాసుకున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. ఇప్పటికీ మాకు ఓటు వేయకపోవడం ప్రజలదే తప్పు అనే భావనలో ఉండటం సరైంది కాదని హితవు పలికారు. మీ తప్పులను సమీక్షించుకోండని సలహానిచ్చారు. సహేతుకమైన విమర్శలు చేయాలన్నారు. ప్రజలు విజ్ఞులు, ప్రజలను తప్పుపట్టడం మానండని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. పిల్లి శాపనార్థాలు పెడితే ఉట్టిపడదన్నారు. కృష్ణా జలాలపై ఎన్నో అపోహలుండేవని, ఈ నేపథ్యంలోనే అసెంబ్లీలో పూర్తిస్థాయి చర్చ పెట్టడం జరిగిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు.. నీటిపారుదల శాఖ మంత్రులుగా ఉన్నప్పుడు ఏం జరిగింది.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా ఉన్న ఈ రెండేండ్లలో ఏం జరిగిందనేది స్పష్టంగా చర్చ జరిగిందని చెప్పారు. వాళ్ల ప్రశ్నలకు సమాధానం కూడా చెప్పామన్నారు. మీరు తప్పు చేశారనే ప్రజలు గుర్తించి శిక్షించారని తెలిపారు. గోదావరి జలాలపై అబద్ధాలను ప్రచారం చేయడం మానుకోవాలని కోరారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేసి ఇతర ప్రాజెక్టులను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులుండేవని, ఆ పదేండ్లలో ప్రాజెక్టులను పూర్తి చేస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని తెలిపారు. రాష్ట్రంలో రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారముందన్నారు. 2001లో దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.6 వేల కోట్లు అని, అనంతరం అంచనాలు రూ.13,400 కోట్లకు, రూ.14,500 కోట్లకు పెరిగాయని, తాజాగా రూ.18,500 కోట్లకు అంచనాలు ఎగబాకాయని చెప్పారు. ఇకనైనా ఈ అంచనాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. ఈ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. గోదావరిపైనున్న తుమ్మిడిహట్టి నుంచి భద్రాచలం వరకు ఎన్ని ప్రాజెక్టులుంటే అన్ని ప్రాజెక్టుల పనులనూ సమీక్షించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఒక్క నీటిబొట్టును లిఫ్టు చేయకపోయినా దేశంలో గత రెండేండ్లలో వరిని అత్యధికంగా పండించడంలో, ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రమే నెంబర్ వన్‌గా ఉండేది కాదన్నారు.

# ఐఎన్ఎస్ అరిదమన్...

## భారత్ అమ్ములపొదిలో శత్రుభీకర అస్త్రం

**ఢిల్లీ ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్) -**

సముద్ర జలాల్లో భారత అణు నిరోధక సామర్థ్యం అనూహ్యంగా పెరగనుంది. దేశీయంగా నిర్మించిన మూడో అరిహంత్-శ్రేణి అణు బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి (ూూదీచీ) 'ఐఎన్ఎస్ అరిదమన్' (ూ4) ఈ ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో నావికాదళంలోకి ప్రవేశించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఇది సముద్ర పరీక్షల తుది దశలో ఉందని రక్షణ రంగ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామం భారత నావికాదళ శక్తిని, ముఖ్యంగా ప్రతీకార దాడి సామర్థ్యాన్ని శిఖర స్థాయికి చేర్చనుంది.విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసెల్ ప్రాజెక్టు కింద ఐఎన్ఎస్ అరిదమన్‌ను నిర్మించారు. 7,000 టన్నుల బరువున్న ఈ జలాంతర్గామి, ఇదివరకే సేవలు అందిస్తున్న ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అరిఘాత్ (6,000 టన్నులు) కంటే పెద్దది, శక్తిమంతమైనది. దీని బరువు పెరగడం వల్ల క్షిపణులను మోసుకెళ్లే సామర్థ్యం కూడా గణనీయంగా పెరిగింది.

పాత నౌకల్లో కేవలం నాలుగు వర్టికల్ లాంచ్ సిస్టమ్ (ఝూ) ట్యూబ్‌లు ఉండగా, అరిదమన్‌లో వీటి సంఖ్యను ఎనిమిదికి పెంచారు. దీని ద్వారా ఒకేసారి 24 స్వల్ప శ్రేణి ఖ-15 సాగరిక (750 కి.మీ. పరిధి) క్షిపణులను లేదా 8 మధ్యంతర శ్రేణి ఖ-4 (3,500 కి.మీ. పరిధి) క్షిపణులను ప్రయోగించవచ్చు. భవిష్యత్తులో రానున్న 6,000 కి.మీ. పరిధి గల ఖ-5 క్షిపణులను కూడా మోసుకెళ్లేలా దీనిని రూపొందించారు.

అరిదమన్‌కు 83 మెగావాట్ల సామర్థ్యం గల కాంపాక్ట్ లైట్ వాటర్ రియాక్టర్ శక్తిని అందిస్తుంది. ఇది చాలా తక్కువ శబ్దం (లో అకౌస్టిక్ సిగ్నేచర్) చేస్తుంది. దీంతో పాటు అనెకోయిక్ టైల్స్, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'ఉషుస్', 'పంచేంద్రియ' వంటి అత్యాధునిక సోనార్ వ్యవస్థల వల్ల సముద్ర గర్భంలో శత్రు రాడార్లకు, సోనార్లకు చిక్కకుండా అత్యంత రహస్యంగా కదలగలదు. ఉపరితలంపై గంటకు 12-15 నాట్ల వేగంతో, నీటి అడుగున 24 నాట్ల వేగంతో ఇది ప్రయాణిస్తుంది.అరిదమన్ చేరికతో, భారత వ్యూహాత్మక దళాల కమాండ్ (ూఖీజ) పరిధిలోకి మూడు అణు జలాంతర్గాములు వస్తాయి. దీనివల్ల 'నిరంతర సముద్ర పర్యవేక్షణ' (Continuous At`Sea Deterrence) సాధ్యమవుతుంది. అంటే, కనీసం ఒక అణు జలాంతర్గామి ఎల్లప్పుడూ సముద్రంలో పహారా కాస్తూ, శత్రువుల నుంచి ముప్పు ఎదురైతే వెంటనే ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉంటుంది. దీనిని విశాఖపట్నం సమీపంలోని అత్యంత భద్రత కలిగిన నావికా స్థావరం 'ప్రాజెక్ట్ వర్ష'లో మోహరించనున్నారు.

ఇది భారత అణు త్రివిధ దళాల (భూమి, గగనతలం, సముద్రం) సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేస్తుంది. ఇదే సమయంలో రష్యా నుంచి చక్ర-××× అటాక్ సబ్‌మెరైన్, జర్మనీ సహకారంతో ప్రాజెక్ట్-75(×) కింద మరో ఆరు జలాంతర్గాముల నిర్మాణం వంటి ప్రాజెక్టులతో భారత నావికాదళం తన శక్తిని మరింత విస్తరించుకుంటోంది.

# ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్

మొదటిపేజీ తరువాయి

భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో కీలక సహకార ఒప్పందం (వీశీజ) కుదిరింది. సీఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. డిజిటల్ భారత్ నిధి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య కుదిరిన ఈ ఒప్పందంపై డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సంతకాలు చేశారు.

**భారత్ నెట్ ప్రాజెక్ట్‌తో డిజిటల్ విప్లవం**

రాష్ట్రంలో సుమారు 5 లక్షల గ్రామీణ గృహాలకు ఫైబర్ కనెక్షన్లు అందించే లక్ష్యంతో 'అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్-ఏబీఎన్‌పీ'ని అమలు చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,432 కోట్లు కేటాయించడానికి అంగీకరించింది. ప్రాజెక్ట్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్' (ూూదీ×ూ) పేరుతో ప్రత్యేక యంత్రాంగాన్ని (ూూఎ) ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిధులు సమకూర్చి ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లనున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా ఫేజ్-× కింద ఉన్న 1,692 పంచాయతీల్లో నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయడం, ఫేజ్-××లోని 11,254 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పూర్తి చేయడం, కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కనెక్షన్లు ఇవ్వడం వంటి పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ సేవలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**గత ప్రభుత్వం ఫైబర్ నెట్‌ను నాశనం చేసింది: సీఎం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. "2014-19 మధ్య కాలంలో విద్యుత్ స్తంభాల ద్వారా ఫైబర్ కేబుల్స్ వేసి 9.78 లక్షల ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చాం. కానీ 2019లో వచ్చిన ప్రభుత్వం దురుద్దేశంతో ఆ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసింది. దాని ఫలితంగా కనెక్షన్ల సంఖ్య 3.80 లక్షలకు పడిపోయింది. ఇప్పుడు మళ్లీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో డిజిటల్ కనెక్టివిటీని ప్రతి ఇంటికీ అందిస్తాం" అని ఆయన వివరించారు. తాను తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి టెక్నాలజీకి ప్రాధాన్యత ఇస్తున్నానని, టెలికాం రంగంలో సంస్కరణల కోసం నాటి ప్రధాని వాజ్‌పేయిని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

**టెక్నాలజీతో సుపరిపాలన, ఏపీకి ఉజ్వల భవిష్యత్తు**

"ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో దేశంలో డిజిటల్ విప్లవం అద్భుతంగా సాగుతోంది. గ్లోబల్ నాలెడ్జ్‌ను గ్రామాలకు చేర్చాలంటే బ్యాండ్ విడ్త్ పెరగాలి. దానికి కేంద్రం సహకరిస్తుండటం శుభపరిణామం" అని చంద్రబాబు అన్నారు. టెక్నాలజీతో పాలనను సులభతరం చేస్తున్నామని, వాట్సాప్ ద్వారా 900కు పైగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూ రికార్డులకు భద్రత కల్పిస్తున్నామని, సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తేబోతున్నామని చెప్పారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ఉద్యోగాలు పోతాయనే భయం వద్దు. ఏఐ ద్వారా కొత్త ఉద్యోగాలు సృష్టించేలా యువతలో నైపుణ్యాలు పెంచుతున్నాం. వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ ఎక్స్‌పర్ట్ అనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి కన్సార్షియంతో దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను రాష్ట్రానికి తెస్తున్నాం. రానున్న రెండేళ్లలో అమరావతి నుంచే క్వాంటం కంప్యూటర్లు ఉత్పత్తి చేయాలనేది మా ఆలోచన. టెక్నాలజీ, టెలికాం రంగంలో ఎలాంటి ప్రయోగాలు చేయాలన్నా ఆంధ్రప్రదేశ్ ఒక టెస్ట్ బెడ్‌గా సిద్ధంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు.

# లొంగిపోయిన మావోయిస్టు దేవ్‌జీ!

**ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్) -ఃు**

సీపీఐ(మావోయిస్టు) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీతో పాటు మరో కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డిలు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయారు. వీరితో పాటు మరో 20 మంది మావోయిస్టులు కూడా సరెండరయ్యారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 17 మంది మావోయిస్టులు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారనీ, వారు కూడా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని డీజీపీ ఇటీవల చేసిన ప్రకటన ప్రభావమో, మరోవైపు ఎస్ఐబీకి చెందిన స్పెషల్ ఆపరేషన్ టీం రాష్ట్ర సరిహద్దుల్లో విశ్వసనీయమైన సమాచారం మేరకు జరిపిన ప్రత్యేక ఆపరేషన్ కారణంగా దేవ్‌జీ, రాజిరెడ్డి బృందం లొంగుబాటులో నడిచినట్టు తెలుస్తోంది.

**నంబాల మరణం తర్వాత దేవ్‌జీకి పగ్గాలు**

కేంద్ర ప్రభుత్వం గత కొన్ని నెలలుగా మావోయిస్టు విముక్త భారత్ నినాదంతో ఆపరేషన్ కగార్‌ను చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్ ద్వారా తొమ్మిది మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలతో పాటు కీలకమైన దండకారణ్యంలో వేలాది మంది సాయుధ బలగాలతో చేపట్టిన ఆపరేషన్ కారణంగా వందల మంది మావోయిస్టులు మరణించడం, దాదాపు అదే సంఖ్యలో లొంగిపోవడం, అరెస్ట్ కావడం జరిగింది. ముఖ్యంగా కొన్ని నెలల క్రితం కర్రెగుట్టలో జరిగిన భారీ ఆపరేషన్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు కీలకమైన నాయకశ్రేణిలోని మావోయిస్టులు మరణించారు. కేశవరావు మరణం తర్వాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల సమీపంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీ పగ్గాలను చేపట్టినట్టు ప్రకటించారు.

**ఆపరేషన్ కగార్ తీవ్రత.. పాతబడ్డ ఆయుధాలు..**

ఒకపక్క ఆపరేషన్ కగార్ తీవ్రత పెరగడం, మరోపక్క మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో ముందుకు సాగడం, ఇంకోపక్క దట్టమైన అటవీ ప్రాంతాలను సైతం జల్లెడ పడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్లు, మావోయిస్టులకు సంబంధించి అందిస్తున్న సమాచారంతో సాయుధ బలగాలు కూంబింగ్ ఆపరేషన్‌ను ఉధృతం చేయడంతో మావోయిస్టులకు క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి. పోలీసుల వద్ద ఉన్న ఆధునిక ఆయుధాల ముందు తమ వద్ద ఉన్న పాతబడిన ఆయుధాలతో ఎదుర్కోని పరిస్థితులతో వందలాది మంది మావోయిస్టులు నేలకొరిగారు. అదే సమయంలో ఈ మార్చి 31 నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మారుస్తామని కేంద్ర హౌం శాఖ మంత్రి అమిత్‌షా డెడ్‌లైన్‌ను పునరుద్ఘాటిస్తూ వస్తున్న విషయం విదితమే.

## లడ్డూ వ్యవహారంలో డైవర్షన్ పాలిటిక్స్ : భూమన

మొదటిపేజీ తరువాయి

ఆదివారం నాడు వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. లడ్డూ అంశంపై ఏకసభ్య కమిటీని నియమించడం సుప్రీంకోర్టును అవమానించడమేనని అన్నారు. "లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో జంతు కొవ్వు లేదని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే సీబీఐ సిట్ బృందం స్పష్టంగా నివేదిక ఇచ్చింది. ఇప్పుడు ఆ నివేదికను ప్రశ్నించేలా కమిటీ వేయడం సర్వోన్నత న్యాయస్థానం గౌరవాన్ని సవాలు చేయడమే" అని ఆయన పేర్కొన్నారు.లడ్డూపై చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా చేసిన తప్పుడు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ కమిటీని ఏర్పాటు చేశారని భూమన ఆరోపించారు. సిట్ నివేదికతో వారి వాదనలు తప్పని తేలడంతో, ముఖం చాటేసేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కమిటీ చట్టపరంగా నిలబడదని ఆయన అభిప్రాయపడ్డారు.

"ఈ కుంభకోణానికి మూలమైన హెరిటేజ్, ఇందాపూర్, భోలే బాబా డెయిరీల మధ్య ఉన్న సంబంధాలను మేం బయటపెడుతూనే ఉంటాం" అని కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు, పరకామణి చోరీ కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, రాజకీయ ప్రత్యర్థులను ఇరికించేందుకు టీటీడీ ప్రయత్నిస్తోందని, ఇది కూడా ప్రజల దృష్టిని మళ్లించే కుట్రలో భాగమేనని ఆయన ఆరోపించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు భయపడబోమని, న్యాయపోరాటం చేస్తామని భూమన తేల్చి చెప్పారు.

# చంద్రబాబు, జగన్‌లు బీజేపీకి బానిసలు

మొదటిపేజీ తరువాయి

ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు.

ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు.ప్రజల్లో కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతుండటం చూసి ఓర్వలేకే బీజేపీ తమ నిరసనకు ఉగ్రవాద కోణాన్ని అంటగడుతోందని, ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. మోదీ కాషాయ కామెర్లు సోకిన వారు ఇలా కాకుండా ఎలా మాట్లాడతారని ఆమె వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# రాంచందర్‌రావు అరెస్టు

మొదటిపేజీ తరువాయి

బాన్సువాడకు బీజేపీ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు యత్నించిన పలువురు పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. మరి కొందరిని గృహ నిర్బంధం చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డితో పాటు బాన్సువాడలో పలు కుటుంబాలను పరామర్శించేందుకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును తార్నాకలోని నివాసం వద్ద పోలీసులు అరెస్టు చేసి బొల్లారం ఠాణాకు తరలించారు. దీంతో ఆయన్ను విడుదల చేయాలని బీజేపీ కార్యకర్తలు పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేశారు. మరోవైపు, కామారెడ్డికి బయలుదేరిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్యలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీధర్ గౌడ్ పోలీసుల కన్నుగప్పి కామారెడ్డికి రావడంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. బాన్సువాడ వెళుతున్న మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ను మార్గమధ్యలోనే పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బొల్లారం పోలీసు స్టేషన్‌లో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ చెప్పుచేతల్లో సర్కారు కొనసాగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం చేతిలో బందీగా మారిందని విమర్శించారు. పోలీసులు తనను అక్రమంగా అరెస్టు చేయడం, ముందస్తుగా గృహ నిర్బంధం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బాన్సువాడలో హిందువుల ఇళ్లపై జరిగిన రాళ్ల దాడి అత్యంత అమానుషమని అన్నారు. బాన్సువాడలో ఒక్క ఎంఐఎం కార్యకర్తను కూడా అరెస్టు చేయని పోలీసులు80మంది బీజేపీ, హిందూ సంఘాల కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. హిందూ సంఘాలపై, తమ పార్టీ కార్యకర్తలపై నమోదు చేసిన తప్పుడు కేసులను సహించబోమని తేల్చిచెప్పారు. తాను బాన్సువాడ వెళ్లి తీరతానని, బాధితులను పరామర్శిస్తానని చెప్పారు.

## మూసీ బాధితులకు అండగా ఉంటాం..

మొదటిపేజీ తరువాయి

మండలం హైదర్షాకోట్, బండ్లగూడ బాధితులను ఆదివారం కలిసి మాట్లాడారు. ఆయనతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ కార్తీక్‌రెడ్డి ఉన్నారు. మధుపార్క్ రిడ్జ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ.. మూసీ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని.. వారి పక్షాన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. ఆనాడు కేసీఆర్ మంచి నీళ్లు ఇచ్చి బతుకులను నిలబెడితే, రేవంత్ బుల్డోజర్లు పెట్టి వారి జీవితాలను కూలగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధుపార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులు బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము మూసీ శుద్ధికి వ్యతిరేకం కాదని.. ప్రజల కోసం, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసమే మాట్లాడుతున్నామని చెప్పారు. 'చదువుకునే పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్, రైతులకు రైతు బంధు అడిగితే డబ్బుల్లేవని సీఎం అనడం విడ్డూరంగా ఉంది. పైసలు లేకపోతే మెస్సీతో ఫుట్‌బాల్ మ్యాచ్, మిస్ వరల్డ్ పోటీలకు వందల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి..? బడా కాంట్రాక్టర్లకు రూ.20 వేల కోట్లు బిల్లులు ఇచ్చారు. ఇప్పుడు ఎవరి జేబులు నింపడానికి మూసీ ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారు?' అని నిలదీశారు. మూసీ బాధితులను బీజేపీ నేతలు కూడా పరామర్శించారు

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888



# అవుకు మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అవుకు ఫిబ్రవరి 21 రిపబ్లిక్ (న్యూస్)**

అవుకు మోడల్ స్కూల్ పాఠశాల నందు విద్యాశాఖ ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరానికి గాను అవుకు ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హేమీమా తెలిపారు గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి తెలుగు లేదా ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుతూ ప్రమోషన్‌కు అర్హత పొందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు వయోపరిమితి ప్రకారం ఓసీ బీసీ విద్యార్థులు 01-09-2014 నుండి 31-08-2016 మధ్య జన్మించి ఉండాలి ఎస్సీ ఎస్టీ విద్యార్థులు 01-09-2012 నుండి 31-08-2016 మధ్య జన్మించి ఉండాలిఅర్హత కలిగిన విద్యార్థులు 24-02-2026 నుండి 31-03-2026 వరకు



ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓసీ బీసీ విద్యార్థులు రూ.150 ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.75 ఆన్లైన్ ఫీజు చెల్లించి వెబ్‌సైట్‌లో అప్లై చేయాలి ప్రవేశ పరీక్ష 12-04-2026న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మోడల్ స్కూల్స్‌లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడుతుంది. పరీక్ష తెలుగు ఇంగ్లీష్ మాధ్యమాల్లో సీబీఎస్సీ విధానానికి అనుగుణంగా ఉంటుంది. కనీస అర్హత మార్కులు ఓసీ బీసీ విద్యార్థులకు 35 ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు 30గా నిర్ణయించారుప్రవేశ పరీక్షలో వచ్చిన మార్పులకు అనుగుణంగా రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుందని అవుకు మండల పరిధిలోని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమీమా వైస్ ప్రిన్సిపాల్ మునీంద్ర మరియు పాఠశాల సిబ్బంది కోరారు

# ఇద్దరు బిడ్డల తండ్రి మైనర్ బాలికతో జంప్..

## తన కుమార్తెకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లిపోయాడని మైనర్ బాలిక తండ్రి ఫిర్యాదు..

**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 22 - (రిపబ్లిక్ న్యూస్) -**

మదనపల్లి :- తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలోని ములకలచెరువు మండల కేంద్రమైన నాయనచెరువుపల్లి గ్రామానికి చెందిన పోతుల హరినాథ్ (42) (తంబళ్లపల్లి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ స్వయాన సోదరుడు) ఇతనికి వివాహమై భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండు రోజులకు ముందు కదిరినాధునికోట గ్రామపంచాయతీ బీగం వారి పల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ కుమార్తె (మైనర్ బాలిక) ను మాయ మాటలతో తన వెంట తోడుకుపోయాడని మైనర్ బాలిక పెదనాన్న మరియు తండ్రి ఆదినారాయణ, ఆదివారం మీడియా ముందు తన గోడును వెళ్ళబోసుకున్నారు. 19వ తారీఖున అర్ధరాత్రి సమయంలో తమను బెదిరించి తమ కుమార్తెను తన వెంట తీసుకెళ్లాడని చుట్టుపక్కల మొత్తం వెతికిన ఆచూకీ లభించలేదని ఎక్కడున్నారో అర్థం కావటం లేదని పోలీసులు సకాలంలో స్పందించి తమ కుమార్తెను వెతికి పట్టి క్షేమంగా ఇల్లు చేర్చాలని సదురు మైనర్ బాలిక తండ్రి





ఆదినారాయణ పోలీసులకు మరియు మీడియాకు విన్నవించుకున్నారు. ఈ ఘటనపై జనసేన ఇంచార్జ్ పోతుల సాయినాథ్ ను రిపబ్లిక్ వార్తాపత్రిక పాత్రికేయులు పలకరించారు. ఆయన మీడియాకు వెల్లడిస్తూ తన అన్న చేసిన తప్పుకు నింద మోయాల్సి వస్తోందని శనివారం తనే స్వయంగా ములకలచెరువు సిఐ, ఎస్ ఐ కి చెప్పి కేసు ఫైల్ చేయమని చెప్పానని నెల రోజులకు ముందు కూడా ఇంట్లో గొడవలు జరిగితే మా అన్న వదినను సామరస్యంగా ఒకటి చేశామని కానీ ఇంతలోనే మా అన్న చేసిన తప్పుకు తలెత్తుకో లేకున్నామని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ తెలిపారు. ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని తను ఎవరిని బెదిరించలేదని వాళ్లు దొరికితే చట్టం తన పని అది చేసుకెళ్తుందని పోతుల సాయినాథ్ అన్నారు. మైనర్ బాలిక తండ్రి ఆరోపిస్తూ తన కుమార్తె ను ఇద్దరు పిల్లల తండ్రి వెంటబెట్టుకుని తీసుకెళ్లిపోయాడని ఫిర్యాదు చేసిన నామమాత్రం కేసు స్వీకరించారని కానీ బాధితుడి పై ఇంత వరకు చర్యలు తీసుకోలేదని ఆదినారాయణ తెలిపారు..

# ఘనంగా కేజీబీవీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు..

## మన మాతృ భాషను మరచిపోతే మన కన్నతల్లిని మరచినట్లే.. నిర్మల

**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 22 - (రిపబ్లిక్ న్యూస్) -**

మదనపల్లి :- స్థానిక నియోజకవర్గ పరిధిలోని కురబలకోట మండల కేంద్రమైన స్థానిక కేజీబీవీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నామని తెలుగు భాషోపాధ్యాయుని నిర్మల తెలిపారు. కేజీబీవీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్కడ చదువుతున్న విద్యార్థినీలు తెలుగుదనం ఉట్టిపట్టేలా సాంప్రదాయ దుస్తులలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాలుపంచుకుంటూ కేజీబీవీ తెలుగు భాషోపాధ్యాయుని తలపెట్టిన వివిధ కవితల పోటీలు, పద్యాపఠన పోటీలు, కథల పోటీల నిర్వహణ మరియు ఆట పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినీలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తెలుగు భాషోపాధ్యాయుని నిర్మల మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి ప్రధాన విభాగం యునెస్కో 1999 లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. నాటి పాకిస్థాన్ లో బెంగాలీలు 1952లో తమ మాతృభాష బెంగాలీ పరిరక్షణ కోసం చేసిన పోరాటానికి గుర్తుగా బంగ్లాదేశ్ ప్రతిపాదన మేరకు ఈ తేదీ ఖరారైందని యునెస్కో



విద్యాబోధనలో కనీసం మూడు భాషలు గల మాతృభాష, జాతీయ భాష, అంతర్జాతీయ భాషలకు చోటుండాలని 1999 నుంచి ప్రచారం చేయడం ఆరంభించిందని పిల్లలు పసిప్రాయంలో మాతృభాష తరువాత మిగిలిన రెండు భాషలు నేర్చుకుంటే వారి జీవితం సాఫీగా సాగిపోతుందన దానిపై ప్రతిపాదన చేసింది. చిన్న పిల్లల మానసిక ఆరోగ్యానికి వారి మాతృభాషతో సంబంధం ఉందని పరిశోధకులు తేల్చారు. పుట్టిన దగ్గర నుంచి మాతృభాష ధ్వనులు వింటుండడం వల్ల వారిపై ప్రభావం చూపుతాయని మాతృభాషలో మాట్లాడలేని పిల్లల్లో చురుకుదనం తక్కువగా ఉంటుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. అమ్మపాలు, అమ్మభాష లకు ఏవీ సాటిరావు. ఎదుగుదలకు అభివృద్ధికి మాతృభాష ఎంతగానో తోడ్పడుతుంది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో కొన్ని భాషలకే అధిక ప్రాధాన్యం లభిస్తురటం వలన రాబోయే కాలంలో వందలాది భాషల ఉనికి అంతరించిపోయే ప్రమాదం కనబడుతోంది. గనుక మనందరం మన మాతృభాష ఉనికిని మనం కాపాడుకోవాలి. మన భాషా సంస్కృతి వారసత్వాన్ని నిలబెట్టుకునేందుకు మనలో ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి. మన మాతృ భాషను మరచిపోతే మన కన్నతల్లిని మరచినట్లేననే భావనకు రావాలి. ఈ రోజుల్లో ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం ఇతర రాష్ట్రాలలో, విదేశాల్లో స్థిరపడిపోతున్నారు. పిల్లలు తమ మాతృభాషకు దూరమవుతున్నారు. మనమే మన పిల్లలకు చిన్నతనం నుంచే మన మాతృభాష మాధుర్యం మమకారం వారికి నేర్పుతుండాలి. రాయడం, చదవడం నేర్పాలి. ఆధునిక నాగరికత మోజులో పడిపోయి మన మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదు. యునెస్కో కూడా ఇదే సూచిస్తోంది. మన మాతృభాషను కాపాడుకోవలసిన బాధ్యత మనదే. అందరికీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుభాకాంక్షలంటూ నిర్మల పేర్కొన్నారు..

# చమర్తికి మతిభ్రమించిందా..!

## ఆకేపాటి అమరనాథ్ రెడ్డి పై చమర్తి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం..



**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 22 - (రిపబ్లిక్ న్యూస్) -**

మదనపల్లి :- ఆకేపాటి అమరనాథ్ రెడ్డి పై చమర్తి చేస్తున్న భూ కబ్జాల ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆయన మతి భ్రమించి మాట్లాడుతున్నారని రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి అనుచరులు మండిపడ్డారు. ఈ సందర్భంగా వాళ్లు ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామివారిని రాజకీయంగా వాడుకుంటే నాశనం తప్పదని హెచ్చరించారు. రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి గోవిందమాల ధరించి 40 రోజుల పాటు కఠోర దీక్ష చేపట్టి తదనంతరం తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి వందలాది మంది భక్తులకు అన్ని సమకూరుస్తూ కాలినడకన 22 సార్లు తిరుమలకు వెళ్లి స్వామివారి దర్శనం చేసుకున్న శ్రీవారి నిజ భక్తుడని ఆయన అనుచరులు గుర్తు చేశారు. ప్రతి రోజూ ఉదయం నాలుగు గంటలకు లేచి గోపూజ చేయడం ఆయన భక్తికి శ్రద్ధకు నిదర్శనమన్నారు. ఆయనకు ఎలాంటి వ్యాపారాలు లేవని, కాంట్రాక్టర్లు కూడా లేరని నిరంతరం ప్రజాసేవే ధ్యేయమని పేర్కొన్నారు. చమర్తి ఆయనపై చేస్తున్న భూకబ్జాల ఆరోపణలు నిరూపించాలని ఆకే పాటి అనుచరులు సవాల్ విసిరారు. కళ్యాణమండపం కోసం తన సొంత భూమిని టీటీడీకి విరాళంగా అందించి రిజిస్టర్ చేయించడం జరిగిందని ప్రజల ప్రయోజనార్థం టీటీడీ కి సొంత భూమిని అప్పజెప్పారని స్పష్టం చేశారు. పనులు దశలవారీగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో మీ ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో ఏమి అభివృద్ధి చేసిందో ఈ రెండేళ్లలో ఏం సాధించారో చెప్పాలని చమర్తిని ప్రశ్నించారు. మరో మారు స్వామి వారిని రాజకీయంగా వాడుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు..

# బి.ఎడ్ విద్యార్థిని సూసైడ్..
# మృతికి గల కారణాలు చెప్పలేకపోతున్న తల్లి..

**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 22 - (రిపబ్లిక్ న్యూస్) -**




మదనపల్లి :- రైల్వేకోడూరు లో ఒక యువతి ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పట్టణంలోని రంగనాయకులపేటకు చెందిన ఆమంచి భార్గవి (24) తన నివాసంలో బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బి.ఎడ్ చదువుతున్న భార్గవి ఆదివారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ అఘాయిత్యానికి ఒడిగట్టిందన్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన పోలీసులు మృతురాలి మృతురాలి ఇంటికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. భార్గవి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఉన్నత చదువులు చదువుతున్న యువతి ఇలా అర్థాంతరంగా తనువు చాలించడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# 20 వేల కోసం 70 లక్షల ప్లాంట్ బొక్క..

## గత మూడేళ్లుగా టెక్నీషియన్ లేక ఆక్సిజన్ ప్లాంట్ కు పట్టిన చెదలు..

**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 22 - (రిపబ్లిక్ న్యూస్) -**



మదనపల్లి :- తంబళ్లపల్లె నియోజకవర్గం పరిధిలోని బి. కొత్తకోట నగర పంచాయతీ కేంద్రమైన స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్ సీ) నందు గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయం లో రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి శాసనసభ్యుల పెద్దిరెడ్డి ద్వారకారునాథ్ రెడ్డి సహకారంతో ఎంపీ ల్యాడ్స్ నుంచి 70 లక్షల రూపాయల నిధులను వేచించి కోవిడ్ బాధితుల కొరకు ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కానీ దానికి తగ్గట్టు సరైన టెక్నీషియన్ ను నియమించలేని కారణంగా ప్లాంటును ఆక్సిజన్ ఉత్పత్తి చేయడం లేదు. కూటమి ప్రభుత్వ పాలన నుంచి ఆక్సిజన్ ఉత్పత్తి కావడం లేదు. 70 లక్షల ప్రజాధనం దుర్వినియోగమవుతున్న అత్యవసరమయిన ఆక్సిజన్ ప్రజలకు అందించడంలో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. ఇకనైనా దీనిపై ఆరోగ్యశాఖ స్పందించి కూటమి ప్రభుత్వ చొరవతో అక్సిజన్ ప్లాంట్ నడిచే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు..

# పలు ముఖ్య కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా తంబళ్లపల్లి శాసనసభ్యులు..పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి

**అన్నమయ్య జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 22 - (రిపబ్లిక్ న్యూస్) -**

మదనపల్లి :- తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారాకానాథ్ రెడ్డి ఆదివారం బిజీ బిజీగా గడిపారు. అన్నమయ్య జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం నుండి పలు ముఖ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత మట్లివారిపల్లి గ్రామానికి చెందిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమశేఖర్ రెడ్డి కుమార్తె వివాహానికి కేఎన్ఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవ కార్యక్రమానికి కుటుంబ సభ్యులు ఆహ్వానం మేరకు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివాహ మండపం వద్దకు విచ్చేసిన ద్వారకానాథ్ రెడ్డిని కుటుంబ సభ్యులు దుశ్శాలువ కప్పి పూల బొకే అందించి వివాహ మండపంలోనికి ఆహ్వానించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి కొద్దిసేపు సరదాగా గడిపారు. బంధువులతో ముచ్చటించారు. అనంతరం కుటుంబ సభ్యుల కోరిక మేరకు సెల్ఫీ ఫోటోలకు దిగారు. నూతన వధూవరులను కలిసి వివాహ శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. వివాహానికి విచ్చేసిన వైసీపీ శ్రేణులను ఆత్మీయంగా పలకరించి యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరో వివాహానికి హాజరయ్యారు. తంబళ్లపల్లి మండల కేంద్రమైన బాలిరెడ్డి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాధవరెడ్డి కుమారుడి వివాహం భారత్



కళ్యాణ మండపం లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవ కార్యక్రమానికి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వివాహ మండపం వద్దకు విచ్చేసిన ద్వారకానాథ్ రెడ్డిని కుటుంబ సభ్యులు దుశ్శాలువ కప్పి పూల బొకే అందించి వివాహ మండపంలోనికి ఆహ్వానించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి కొద్దిసేపు సరదాగా గడిపారు. బంధువులతో ముచ్చటించారు. అనంతరం కుటుంబ సభ్యుల కోరిక మేరకు సెల్ఫీ ఫోటోలకు దిగారు. నూతన వధూవరులను కలిసి వివాహ శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. వివాహానికి విచ్చేసిన వైసీపీ శ్రేణులను ఆత్మీయంగా పలకరించి యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుండి తిరుగు ప్రయాణమై యర్రసానిపల్లి గ్రామ పంచాయతీ యర్రమద్దువారిపల్లి గ్రామానికి చెందిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లో గుమ్మడి కాయల శంకర్ రెడ్డి నూతన గృహ ప్రవేశం వేద పండితులచే వివిధ పూజ కార్యక్రమాలు నడుమ జరిగింది. ఈ కార్యక్రమానికి గుమ్మడికాయ శంకర్ రెడ్డి ఆహ్వానం మేరకు ద్వారకానాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన స్వగృహం వద్దకు విచ్చేసిన వీరిని కుటుంబ సభ్యులు దుశ్శాలువ కప్పి పూల బొకే అందించి సన్మానించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య జరుగుతున్న పలు పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వద్ద నుండి వేద ఆశీర్వచనం పుచ్చుకున్నారు. శంకర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ నుండి తిరుగు ప్రయాణమై పెద్దమండ్యం మండల కేంద్రమైన సి. గొల్లపల్లి గ్రామానికి చెందిన మరో వివాహానికి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు విచ్చేశారు. వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వాటర్ షెడ్ చైర్మన్ శివయ్య కుమారుడి వివాహానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివాహ గృహం వద్దకు విచ్చేసిన ద్వారకానాథ్ రెడ్డిని కుటుంబ సభ్యులు దుశ్శాలువ కప్పి పూల బొకే అందించి వివాహ మండపంలోనికి ఆహ్వానించారు. కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించారు. బంధువుల కోరిక మేరకు సెల్ఫీ ఫోటోలకు దిగారు. నూతన వధూవరులను కలిసి వివాహ శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. మండల వైసీపీ శ్రేణులను ఆప్యాయంగా పలకరించారు. అక్కడ నుండి తిరుగు ప్రయాణమై పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని సదుం మండల కేంద్రమైన స్థానిక వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గౌరీ కి చెందిన నూతన నయార పెట్రోల్ బంక్ ను కుటుంబ సభ్యులు కోరిక మేరకు ద్వారకానాథ్ రెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈయన చేతుల మీదగా పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. పూజా కార్యక్రమానంతరం బంధువులతో సరదాగా గడిపారు. దేవుడి ఆశీర్వాదంతో వ్యాపారం బాగా జరగాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రముఖ వైద్యుడి ఆహ్వానం మేరకు వైయస్ఆర్ జిల్లా కడప కు వెళ్లారు. జయదీప్ ఫిజియోథెరపీ ఆసుపత్రిని ద్వారకానాథ్ రెడ్డి చేతుల మీదగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అక్కడ వివిధ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైద్యుడి కుటుంబ సభ్యులను కలిసి కొద్ది సేపు సరదాగా గడిపి వైద్యుడితో ముచ్చటించారు. ఈ

## జాతీయ స్థాయి పోటీలకు అభిలాష్ ఎంపిక



**అనంతపురం స్పోర్ట్స్, ఫిబ్రవరి 22,( రిపబ్లిక్ న్యూస్ ):**
బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురంలోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అభిలాష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పల్నాడు జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ టోర్నమెంట్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ గట్టు నాగరాజు ఆదివారం తెలిపారు. బిహార్ రాష్ట్రంలో వచ్చే ఏప్రిల్ 2, 3, 4 తేదీల్లో జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్ పోటీలకు అభిలాష్ వెళ్లనున్నట్లు ఆయన వెల్లడించారు. తమ పాఠశాల కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన అభిలాష్ ను పాఠశాల హెచ్ఎం నీరజ, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు నాగేంద్రప్రసాద్, కోటప్ప, బాలకృష్ణ, ఆదినారాయణ, గొప్పమ్మ, కమల, ఉమ, వెంకటలక్ష్మి, మధుబాల, లీల, సువర్ణ, షబీర్ అభినందించారు.

## పేకాట ఆడుతున్న వ్యక్తులు అరెస్టు

### నగదు,ఫోన్లు,బైకులు స్వాధీనం



**కంబదూరు క్రైమ్,ఫిబ్రవరి 22, ( రిపబ్లిక్ న్యూస్ ):**
అనంతపురం జిల్లా కంబదూరు మండలంలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడులు జరిపారు.జిల్లాలో నేరాలు,అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఎస్ఐ లోకేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం కంబదూరు మండలంలోని వై సి. పల్లి గ్రామ చివర్లో పేకాట ఆడుతున్నట్లు రాబడిన సమాచారం మేరకు 9 మంది ముద్దాయిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.22,600 రూపాయల నగదు,5 మొబైల్ ఫోన్లు,6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

**అసాంఘిక కార్యకలాపాలు కొనసాగినట్లు తెలిస్తే చర్యలు**

జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు,రూరల్ సీఐ నీలకంఠేశ్వర్ వారి సూచనల మేరకు దాడులను చేపట్టామని ఆయన చెప్పారు.వీరిపై కేసు నమోదు చేసి ,రిమాండ్ నిమిత్తం కళ్యాణదుర్గం కోర్టు కు తరలించనున్నామని ఆయన తెలియజేశారు. మండల వ్యాప్తంగా ఎక్కడైనా సరే పేకాట, బిల్లాట, మట్కా , ఆన్ లైన్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు కానీ, అక్రమంగా ఇసుక , మట్టి తరలింపు వంటివి కొనసాగినట్లు తెలిస్తే , 9490108374 అనే నెంబర్ కు సమాచారాన్ని చేరవేయాలని ఆయన మండల ప్రజలను కోరారు.

## మదనపల్లిలో తప్పిన పెను ప్రమాదం..

### సకాలంలో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు..

**అన్నమయ్య జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 22 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :– మదనపల్లెలో పెను ప్రమాదం తప్పింది. ఓ లారీ వేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఆ దెబ్బకు విద్యుత్ స్తంభమే విరిగి చల్లా చెదురైంది. స్థానికులు వెల్లడించిన కథనం మేరకు మదనపల్లె పట్టణ పరిధిలోని నీరుగట్టువారిపల్లి లో గల మార్కెట్ యార్డ్ సమీపంలో ఆదివారం బెంగళూరు నుంచి కడప వైపు వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో స్తంభం విరిగి రోడ్డుపై పడింది. విద్యుత్ తీగలు చెల్లాచెదురయ్యాయి. హై టెన్షన్ వైర్లు ఉండడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. కొద్దిసేపు ట్రాఫిక్ ఆగిపోయింది. ప్రమాద సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. వాహన రాకపోకలు కొనసాగుంటే ప్రాణనష్టమే వాటిల్లేది. స్థానిక ప్రజల సమయస్ఫూర్తితో లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. రద్దీ ప్రాంతంలో ఈ ప్రమాదం జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి అక్కడికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. ప్రజల అప్రమత్తతతో పెద్ద ముప్పు తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు..



## రోడ్డు ప్రమాదాల నివారణపై పెనుగొండలో ఎస్పీ సమీక్షా సమావేశం

### అధిక వేగం, మద్యం డ్రైవింగ్‌పై కఠిన చర్యలు - హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు



**పెనుకొండ, ఫిబ్రవరి 22(రిపబ్లిక్ న్యూస్)**
పెనుగొండ సబ్ డివిజన్ పరిధిలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఐపీఎస్ శనివారం పెనుగొండ డీఎస్పీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీ నర్సింగప్ప, డి టి ఆర్ బి సి ఐ లక్ష్మీకాంత్ రెడ్డి, సీఐలు రాఘవన్, రాజ్ కుమార్, సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణనష్టం పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా పోలీసులు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఎస్పీ సూచనలు:అధిక వేగంతో వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు.మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించడం. నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు. స్కూల్, కాలేజీల పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ కట్టుదిట్టం.గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు త్వరితగతిన వైద్య సహాయం అందేలా చర్యలు. ప్రతి ప్రమాద కేసును శాస్త్రీయంగా విచారణ చేయడం. ఎస్పీ పోలీసుల కృషితో పాటు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు.

## అంతర్జాతీయ ఫిడే రేటింగ్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం.

**. బహుమతులు అందజేసిన డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ -మొదటి మూడు స్థానాలలో నిలిచిన ఆర్నవ్ అగర్వాల్, రామనాథ్ బాలసుబ్రమణ్యం, మణి భారతి**

**. రెండు రోజులపాటు జరిగిన టోర్నమెంట్ లో వివిధ రాష్ట్రాలు, తెలుగు రాష్ట్రాల జిల్లాల నుండి 300 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారు.**

**విజేతలకు 3 లక్ష రూపాయల నగదు బహుమతులు,ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసారు.**



**నంద్యాల ఫిబ్రవరి 202 (రిపబ్లిక్ న్యూస్) :**
ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో శని, ఆది వారాలలో నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల ప్రాంగణంలో జరిగిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన,నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి నిర్వహణలో జరిగిన బహుమతి ప్రదానోత్సవం లో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా క్రీడాభారతి అధ్యక్ష కార్యదర్శులు శాంతినికేతన్ విద్యాసంస్థల సుధాకర్, నిమ్మకాయల సుధాకర్, నంద్యాల లయన్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్ అతిథులుగా పాల్గొని వివిధ వయసు కేటగిరీలలో విజేతలకు 3 లక్ష రూపాయల నగదు బహుమతులు, ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

ప్రథమ స్థానంలో నిలిచిన ఉత్తరప్రదేశ్ కి చెందిన ఆర్నవ్ అగర్వాల్ 30 వేల రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన తమిళనాడుకు చెందిన రామనాథ్ బాలసుబ్రమణ్యం 20వేల రూపాయలు,తృతీయ స్థానంలో నిలిచిన తమిళనాడుకు చెందిన మణి భారతి 15 వేల రూపాయల నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో అంతర్జాతీయ రేటింగ్ టోర్నమెంట్ నిర్వహించడం ప్రశంసనీయమన్నారు.విద్యార్థులను చదువుతోపాటు క్రీడలలో ప్రోత్సహించాలని విద్యాసంస్థలను, తల్లిదండ్రులను కోరారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గెలిచినవారు నిరంతర సాధన ద్వారా భవిష్యత్తులో విజయాలు సాధించాలని, ఓటమి చెందిన వారు తమ పొరపాట్లను సరిదిద్దుకొని నిరంతర కృషిచేసి భవిష్యత్తులో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నంద్యాల జిల్లా క్రీడాభారతి అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ చెస్ క్రీడ పట్ల బాలలలో ఆసక్తి పెరగడం అభినందనీయమన్నారు. జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ లో వివిధ రాష్ట్రాలు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో ఉన్న వివిధ జిల్లాల నుండి 300 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కామినేని పల్లె సర్పంచ్ నరసింహారెడ్డి, తెలంగాణ రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ ఆర్బిటర్ చంద్రమౌళి,చీఫ్ ఆర్బిటర్ ఫణి కుమార్,డిప్యూటీ చీఫ్ ఆర్బిటర్ మణికంఠ, కర్నూలు జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు రాకేష్ రెడ్డి, ప్రకాశం జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు కొండారెడ్డి,నంద్యాల జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి, టోర్నమెంట్ నిర్వాహకురాలు సుజాత, ఎన్.ఆర్.జి చెస్ అకాడమీ వైస్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, రామకృష్ణ పీజీ కళాశాల ప్రో టీమ్ సభ్యులు,క్రీడాకారులు, కోచ్ లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి- వ్యక్తులు అరెస్ట్

### నగదు,3 బైక్ లు, 11 ఫోన్లు స్వాధీనం



**తాడిపత్రి క్రైమ్, ఫిబ్రవరి 22,(రిపబ్లిక్ న్యూస్ ):**
అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం పరిసర గ్రామాలలో కంప చెట్ల మధ్య పేకాట ఆడుతున్న 10 మందిని రాబడిన సమాచారం మేరకు పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 10 మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు తాడిపత్రి రూరల్ యుపిఎస్ పోలీసులు దాడులు నిర్వహించారు. వారి వద్ద నుంచి రూ.72,980 నగదు,03 బైక్ లు, 11 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన నిందితుల వివరాలు : చింబిలి బాబూజీ నాయుడు,మంగళ నారాయణ స్వామి, బందు గల్ల గుర్రప్ప ,కనకం శ్రీరాములు , మంచాల ఈశ్వర్ రెడ్డి, ఉమ్మలరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, చింతమాను శ్రీనివాసులు, దేరంగుల పెద్దిరాజు, సంజావుల శివప్రసాద్, వడిపిల్ల రాజు లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించుటట్లు తెలిపారు.తాడిపత్రి మండలం పరిసర గ్రామాలలోఎవరైనా గ్యాంబ్లింగ్ నిర్వహించినా, జూదం ఆడినా వారి పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ పోలీస్ సిఐ పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామన్నారు. ప్రజలు తమ ప్రాంతాలలో జరిగే జూదం లేదా ఇతర అసాంఘిక కార్యక్రమాలపై సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సి.ఐ వాజ్ఞప్తి చేశారు.

## ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సహాయం

### ఏడిసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి




**శింగనమల సంక్షేమం, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం తిమ్మంపేటలో నివాసముంటున్న సిరిచాటి రవి నాగరత్నమ్మ కూతురు నవనీత వివాహానికి ఏ డి సి సి చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి రూ. 10 వేలు ఆర్థిక చేయూత అందించారు. అందించిన సహాయం పట్ల సిరిచాటి రవి నాగరత్నమ్మ కూతురు నవనీత కృతజ్ఞతలు తెలిపారు.

**నిరుపేద కుటుంబాలకు సహాయం అందించడం సంతోషం**

ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా ఏ డి సి సి బ్యాంక్ చైర్మన్ ,శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ఎంతో సంతోషకరం వారి వైవాహిక జీవితం ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## తెలుగు వీరుడు సమరయోధుడు ఉయ్యాలవాడనరసింహారెడ్డి 179 వ,వర్ధంతి ఘనంగా నిర్వహించిన వైసిపి నాయకులు మరియు నంద్యాల ఎంపీ శబరి





**ఓర్వకల్ ప్రతినిధి, ఫిబ్రవరి 22, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆదివారం రోజుస్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యలవాడ నరసింహ రెడ్డి గారీ 179 వ వర్ధంతి సందర్భంగా కర్నూలు నగరం ఏ క్యాంపు నందు ఉయ్యలవాడ నరసింహ రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాణ్యం నియోజకవర్గం కల్లూరు నుండి ఓర్వకల్లు ఎయిర్ పోర్ట్ వరకు జరిగే ర్యాలీ నీ జెండా ఊపి ప్రారంభించిన నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి మరియు ఎస్వీ మోహన్ రెడ్డి మరియు నంద్యాల ఎంపీ బై రెడ్డి శబరి మరియు రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు తదితరులు!ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, రేనాటి సూర్యుడుగా కొలవబడే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి.1857 నాటి మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధానికి పదేళ్ళ ముందే, బ్రిటిషు దుష్టపాలనపై ఎదిరించి తిరుగుబాటు చేసిన తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి . రాయలసీమలో రాయలకాలం నుండి పాలెగాళ్ళు ప్రముఖమైన స్థానిక నాయకులుగా ఉండేవారు. అట్లాంటి వారిలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఒకడు ఆయన వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించిన వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి మరియు కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి మరియు నాయకులు.

# శాలరీ కాలిక్యులేటర్ పేరుతో కొత్త సైబర్ మోసాలు

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి -కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 22)**
ఎనిమిదో వేతన సంఘం నేపథ్యంలో జీతాల పెరుగుదలపై చర్చలు జరుగుతున్న వేళ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులతో మోసాలకు పాల్పడుతున్నారని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లను లక్ష్యంగా చేసుకుని 8వ సీపీసీ శాలరీ కాలిక్యులేటర్" లేదా శాలరీ రివిజన్ టూల్ పేరుతో వాట్సాప్ సందేశాలు పంపుతూ మోసగాళ్లు అమాయక ప్రజలను వలలో వేస్తున్నారన్నారు.
జీతం ఎంత పెరుగుతుందో అంచనా వేసి చెబుతామని చెప్పి, ఏపీకే ఫైల్‌ను జతచేస్తున్నారన్నారు. ఆ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేసిన వెంటనే వినియోగదారుల మొబైల్ ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఎస్ఎంఎస్‌లు, ఓటీపీలు సైబర్ నేరగాళ్లకు చేరిపోతాయని హెచ్చరించారు.
దీంతో బాధితుల బ్యాంకు ఖాతాల నుండి నగదు అక్రమంగా బదిలీ చేస్తున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఇలాంటి మోసాలపై పలు చోట్ల కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. కొందరు అప్రమత్తత లేకపోవడం వల్ల మోసాలకు గురవుతున్నారని చెప్పారు.
ప్రజలకు సూచనలు:
తెలియని నంబర్ల నుండి వచ్చే లింకులు, ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దు.
శాలరీ క్యాలిక్యులేటర్ 8 వ సిపిసి టూల్ వంటి పేర్లతో వచ్చే యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దు.
బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దు.
అనుమానాస్పద సందేశాలను వెంటనే డిలీట్ చేయండి.
ఎవరైనా మోసానికి గురైనట్లయితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్ నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ శ్రీద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

# వాంతులు విరోచనాలతో పలువురు అస్వస్థత

## బాధితులను పరామర్శించిన టిడిపి నాయకులు

**శింగనమల క్రైమ్, ఫిబ్రవరి 22,(రిపబ్లిక్ న్యూస్):**




శింగనమల మండలం శోధనపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పలువురు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారు. బాధితులు ప్రస్తుతం శింగనమల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన మందులు, వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే శ్రీ బండారు శ్రావణి శ్రీ ఎప్పటికప్పుడు డాక్టర్లతో మాట్లాడి రోగుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. త్వరితగతిన అందరూ కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, అవసరమైతే మరిన్ని వైద్య సౌకర్యాలు కల్పిస్తామని టిడిపి నాయకులు కాయల రమణ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, టిడిపి నాయకులు కాయల రమణ యాదవ్, అట్టే రామాంజనేయులు,ఎస్సీ సెల్ డాల్ వీరనారాయణ, మైనారిటీ సెల్ ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# కేతనపల్లిలో అగ్నిప్రమాదం రూ 25 వేలు ఆస్తి నష్టం



**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్**
మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ కేతనపల్లిలో అగ్నిప్రమాదం సంభవించి రూ 25 వేల వరకు ఆస్తి నష్టం సంభవించిన సంఘటన చోటుచేసుకుంది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కథనం మేరకు... గాండ్లపల్లి కి చెందిన జె నాగరాజుకు కేతనపల్లి వద్ద మామిడి తోట కొబ్బరి తోట ఉన్నాయి .కంచెకు నిప్పంటుకోవడంతో మామిడి చెట్లు కొబ్బరి చెట్లు అగ్నికి
కాలి పోయాయి. విషయం తెలుసుకున్న పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది తరలివచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు.గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం సేవించి బీడీ ముక్కలు వేయడం వల్ల అగ్నిప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ. 25 వేల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు ఆయన వివరించారు.

# హ్యాపీ సండేకు నగరంలో ఉత్సాహభరిత స్పందన

## కొండారెడ్డి బురుజు పార్కులో నృత్యాలు, యోగా, క్రీడలతో సందడి







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 22)**
ప్రజల్లో ఆరోగ్యం, ఆనందాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హ్యాపీ సండే కార్యక్రమాన్ని పునఃప్రారంభించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం కొండారెడ్డి బురుజు వద్దనున్న పార్కులో తొలి హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్యాన్స్, యోగా, జానపద గీతాలు, చెస్, కబడ్డీతో పాటు సంగీతనృత్య ప్రదర్శనలు నిర్వహించగా ఉద్యాన సందర్శకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రాంగణం సందడిగా మారింది.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హ్యాపీ సండే ద్వారా అన్ని వయస్సుల వారిలో ఆరోగ్యంపై అవగాహన పెంపుతో పాటు సామాజిక సౌహార్దం బలపడుతుందని పేర్కొన్నారు. నగర ప్రజలు ప్రతి నెలా 2వ, 4వ ఆదివారాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, ఎం. పవన్, డీఈఈ క్రిష్ణలత, పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమకు నీటి అన్యాయం ఆపాలి

## : వైస్సార్సీపీ నేతల ఆగ్రహం -లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణకు పోరాటం అవసరం మత రాజకీయాలు మానుకోవాలని హెచ్చరిక

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 22)**
రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై జరుగుతున్న అన్యాయాన్ని తక్షణమే నిలిపివేయాలని వైస్సార్సీపీ నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలులో నిర్వహించిన జిల్లా ప్రెస్ మీట్‌లో పలువురు నేతలు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు.
వైస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులివెందుల వాసి సతీష్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఆగిపోవడం వల్ల పోతిరెడ్డి పాడు నుంచి రాయలసీమకు నీరు అందే పరిస్థితి లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రాంతీయ నాయకులంతా ఏకమై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తాను గతంలో పులివెందులలో రాజశేఖర్ రెడ్డి, జగన్‌పై పోటీ చేసిన అనుభవంతో చెబుతున్నానని, మత రాజకీయాలు అవసరం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మత రాజకీయాలు మానుకోవాలని సూచించారు.నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని




రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేయడం వల్ల ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎస్ ఆర్ బి సి ద్వారా సమృద్ధిగా నీరు వచ్చేదని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మరియు తెలంగాణ ముఖ్యమంత్రి కలిసి రాయలసీమను ఎడారిగా మారుస్తున్నారని ఆరోపించారు.
కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరులో 2019లో ప్రారంభించిన గుండ్రేవుల ప్రాజెక్ట్ పురోగతి ఏమిటో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రాజెక్ట్ పూర్తి చేస్తారని హామీ ఇచ్చారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు మతాల మధ్య విభేదాలు రేకెత్తిస్తున్నారని విమర్శించారు.
పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. నారా లోకేష్ తన తండ్రి చరిత్రలో నిలిచే పనులు చేయాలని, కానీ ఇతర అంశాలపై మాత్రమే దృష్టి పెట్టారని విమర్శించారు. ప్రస్తుతం ఆడపిల్ల పుట్టినా భయపడే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఉమ్మడి జిల్లా నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


# వైభవంగా బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్**
చౌడేపల్లి మండలం గడ్డం వారి పల్లి పంచాయతీ బతలాపురంలో ఆదివారం బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల నిర్వహించబడిన ఆలయంలో ఉదయాన్నే వేద పండితులచే బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట జరిగింది. ఆలయ సముదాయంలో వివిధ హోమాలు నిర్వహించి అమ్మవారికి నాడీ సంధానం గావించారు ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు పలు రకాల పుష్పాలతో, మిరమిట్లు కొలిపే విద్యుత్ దీపాలతో ఆలయం కనిపించింది. ఈ ప్రాంతం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు గ్రామస్తులు అన్నదాన శిబిరం ఏర్పాటు చేసి అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలు భక్తులకు అందించారు.



# భక్తులతో కిటకిటలాడిన బోయకొండ గంగమ్మ తల్లి ఆలయం





**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్** అన్నమయ్య జిల్లా, చౌడేపల్లి మండలం, దిగుపల్లి గ్రామంలో శక్తి క్షేత్రంగా విరాజల్లుతున్న శ్రీ బోయకొండ గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం కర్ణాటక, తమిళనాడు ,తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం యాత్రికులకు వసతులు సమకూర్చారు. ఆలయ అర్చక, అధికార సిబ్బంది మౌలిక వసతులు కల్పించారు.

# మైనర్లు వాహనాలను నడపరాదు అతిక్రమిస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.

## సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్.**
తల్లిదండ్రులు మైనర్లు అయిన పిల్లలకు వాహనాలు కొనివ్వకూడదని అతిక్రమించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు అన్నారు పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని వారిని అదుపులో పెట్టాలని సూచించారు వివరాల్లోకి వెళితే ఆదివారం ఓబులవారిపల్లి మండలం చిన్నఓరంపాడులో బుల్లెట్ పై విన్యాసాలు చేస్తూ రాకపోకలకు పాదాచారులకు తీవ్ర అంతరాయం కలిగిస్తూ అసౌకర్యముగా రైడ్ చేస్తున్న యువకుడిని ఓబులవారిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగినది, సాయంత్రం చిన్నారంపాడు క్రాస్ లో బుల్లెట్ పై విన్యాసాలు చేస్తున్న యువకుడి పేరు పుల్లగంటి యశ్వంత్ తండ్రి శీను వయసు 20 సంవత్సరాలు వడ్డేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అన్నారు ఆదివారం సాయంత్రం ఓబులవారిపల్లి క్రాస్ వద్ద హైవే రోడ్డుపై




ఒక బుల్లెట్ మోటార్ సైకిల్‌ను అతివేగంగా నడుపుతూ, స్టంట్‌లు చేస్తూ, రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ మరియు ప్రజలకు అసౌకర్యముగా వాహనాన్ని నడుపుతున్న వ్యక్తిని పట్టుకుని పట్టుకొని, విచారించగా విచారణలో అతను మద్యం మత్తులో ఉండి వాహనాన్ని నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపినట్లు వెల్లడైంది. అదేవిధంగా, అతని బుల్లెట్ మోటార్ సైకిల్‌కు సైలెన్సర్‌ను మార్చి అధిక శబ్దం వచ్చే విధంగా అమర్చినట్లు గుర్తించబడిందని, వాహనా చట్టాల ప్రకారం అతనిపై కేసు నమోదు చేయబడిందన్నారు ప్రతి మోటార్ సైకిల్ రైడర్ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు
హైవే రోడ్లపై వాహనాలను జాగ్రత్తగా మరియు రోడ్డు నిబంధనలకు అనుగుణంగా నడపాలని,
మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని . ఇచ్చిన పక్షంలో తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు మోటార్ సైకిళ్ల సైలెన్సర్‌ను మార్చి అధిక శబ్దం వచ్చేలా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకోబడతాయని ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా భద్రతకు సహకరించాలన్నారు

# 13వ వార్డు కౌన్సిలర్ పట్లూరి శివ శేఖర్ ఘనంగా సన్మానం.

**అందోల్ ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్**
అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 13వ వార్డు కౌన్సిలర్ పట్లూరి శివ శేఖర్ కీ సాక్షి డిజిటల్ న్యూస్ రిపోర్టర్ జెల్ల బాగయ్య , రిపబ్లిక్ రిపోర్టర్ బుచ్చయ్య శాల్వ కప్పి సన్మానించారు.



# 16వ వార్డు కౌన్సిలర్ పట్లోల్ల శ్రీనివాస్ ఘనంగా సన్మానం.





**అందోల్ ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్** :అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 16వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల శ్రీనివాస్ కీ సాక్షి డిజిటల్ న్యూస్ రిపోర్టర్ జెల్ల బాగయ్య , రిపబ్లిక్ రిపోర్టర్ బుచ్చయ్య శాల్వ కప్పి సన్మానించారు.

# 15వ వార్డు వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) ఘనంగా సన్మానం.



**అందోల్ ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్**
అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 15వ వార్డు వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) కీ సాక్షి డిజిటల్ న్యూస్ రిపోర్టర్ జెల్ల బాగయ్య , రిపబ్లిక్ రిపోర్టర్ బుచ్చయ్య శాల్వ కప్పి సన్మానించారు.



# క్రీడాకారులకు జెర్సీ అందజేత



**మల్లాపూర్ ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో స్థానిక క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు పంచరి నవీన్ తన స్వంత నిధులతో జెర్సిలు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా క్రీడా, సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు.జెర్సీలు అందుకున్న క్రీడాకారులు నవీన్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, ఉప సర్పంచ్ గనవేని నందిని మల్లేష్, వార్డు సభ్యులు బాస రాజారెడ్డి, బషీర్, కలసాని రాజన్న, కత్తి నరేష్, నాయకులు రంగు రామగౌడ్, సురుకంటి తిరుపతి రెడ్డి, కాటిపల్లి నారాయణ, కుందేళ్ల రాజేష్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ముందు బిజెపి నాయకుల ఆందోళన



**మల్లాపూర్ ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వేంపల్లి, వెంకట్రావుపేట గ్రామాల భారతీయ జనతా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కామారెడ్డి భారతీయ జనతా పార్టీ కార్యాలయం పై మరియు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అరెస్టుకు నిరసనగా వి,వి రావుపేట్ అంబెద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లవత్ రాజేందర్, సీనియర్ నాయకుడు పెనుకుల అశోక్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, వార్డ్ సభ్యులు వేముల నరేష్ గౌడ్, గోపినేని రాజేందర్, అరెల్లి రాజేశం, పోతూ రంజిత్, అరెల్లి మహేష్, పన్నల శ్రీనివాస్, ముత్కల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## చౌడేపల్లి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన చిన్న రెడ్డప్ప

**చౌడేపల్లి మండలం ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్**

చౌడేపల్లి మండలం సబ్ ఇన్స్పెక్టర్గా చిన్న రెడ్డప్ప నియమితులయ్యారు ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో బాధ్యతలు చేపట్టారు ఇక్కడ పనిచేస్తున్న నాగేశ్వరరావు మదనపల్లి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ కు బదిలీ కాగా, చిత్తూరులో మహిళ పోలీస్ స్టేషన్ నందు ఎస్సైగా ఉన్న చిన్నరెడ్డప్ప ఇక్కడికి నియమితులయ్యారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన చిన్న రెడ్డప్ప అన్నారు.



# కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ పరిశీలన

**గ్రామీణ, వెనుకబడిన వర్గాల బాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తూ, చదువుకు దూరమైన ఎంతోమంది జీవితాల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు వెలుగులు నింపుతున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.**





**మెదక్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22( రిపబ్లిక్ న్యూస్ )**

ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ వెల్దుర్తి మండలం లో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్లోని నిత్యావసర సరుకులను, స్టోర్ రూంను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశు భ్రమైన ఆహారాన్ని అందజేయాలని. నిత్యావసర సరకులను సరఫరా చేసే ఏజెన్సీ వారు నాణ్యమైన వస్తువులను మాత్రమే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని అన్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్య బోధన, భోజన సదుపాయం ఇతర మౌలిక వసతులు ఎలా ఉన్నాయి? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వచ్చే బోర్డు పరీక్షల దృష్ట్యా విద్యార్థులందరూ 10 జీపీఏ సాధించేందుకు ఉపాధ్యాయులు సమగ్ర వ్యూహాన్ని అమలు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో. కస్తూరిబా గాంధీ విద్యాలయం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఆర్థిక భరోసా ముఖ్యమంత్రి సహాయనిధి :ముక్కా వరలక్ష్మి.

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్.**

పేదలకు అందని ద్రాక్షాల కార్పొరేట్ వైద్యం ఉన్న ఈ రోజుల్లో నేనున్నాను అంటూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు అండగా నిలుస్తు వారికి భరోసానిస్తోందని, కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి అన్నారు, వివరాల్లోకి వెళితే

ఓబులవారిపల్లి మండలం మంగంపేట పంచాయతీ అదే గ్రామానికి చెందిన కమటం బాబు అనారోగ్యంతో వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ముక్కా వరలక్ష్మి ని సంప్రదించగా ఆమె స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం మంజూరు చేయించడం జరిగింది . ఈ సహాయ నిధి చెక్కును ఆదివారం ముఖవారిపల్లెలోని వారి కార్యాలయం నందు 1,94,019 లక్ష తొంభై నాలుగు వేల



19 రూపాయల విలువైన చెక్కును వరలక్ష్మి లబ్ధిదారునికి అందజేయడం జరిగినది,

ముక్కా వరలక్ష్మి మాట్లాడుతు పేద ప్రజలు అనారోగ్యంతో ఆర్థిక స్తోమత లేక ఎదుర్కొనే ప్రతి సమస్యకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అర్హులైన కుటుంబాలకు సీఎం



రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా నిరంతరం చర్యలు తీసుకుంటున్నాం అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు పలువురు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది

# పుల్లంపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

## అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి.

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్.**

పుష్పగిరి కంటి వైద్యశాల వారి సౌజన్యంతో మండల కేంద్రం పుల్లంపేటలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది, ఈ ఉచిత కంటి వైద్య శిబిరం పుల్లంపేట మండలం విభిన్న ప్రతిభావంతుల సమైక్య సంఘం అధ్యక్షుడు శుభ నర్సారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది

మండలం నలుమూలల నుంచి కంటి సమస్యలున్న వృద్ధులు పిల్లలు అన్ని వయసులావారు పెద్ద సంఖ్యలో పాల్గొని కంటి వైద్య శిబిరంలో పాల్గొని కంటి వైద్య పరీక్షలు చేయించుకోవడం జరిగినది,

కంటి వైద్య పరీక్షల అనంతరం 30 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగినది,8 మందికి మెరుగైన వైద్యం కోసంశస్త్రచికిత్సకు ఆసుపత్రికి తరలించడం జరిగినది, పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవ సంఘం అధ్యక్షుడు నర్సారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పుష్పగిరి కంటి వైద్య శాల వారి సౌజన్యంతో ఘనంగా నిర్వహించామని, ఈ శిబిరానికి రాజంపేట విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ముఖ్యఅతిథిగా రావడం జరిగినదని ఈ





శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకోవడం సంతోషంగా ఉందన్నారు,

వైద్య పరీక్షల అనంతరం 30 మంది లబ్ధిదారులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయగా, కంటి సమస్యలు తీవ్రంగా ఉన్న 8 మందిని శస్త్రచికిత్స కోసం ఆసుపత్రికి పంపించి చికిత్స అందించే ఏర్పాట్లు చేశామన్నారు,వైద్యులు పాల్గొన్న వారికి కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ అవసరమైన సూచనలు చేశారని తెలియజేశారు,ఈ కార్యక్రమం నిర్వహించడం కొరకు మాకు అవకాశం కల్పించిన పుష్పగిరి కంటి వైద్యశాల వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దొంతు సేవా ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారికి సలహాదారు దొంతు శివయ్య ఉచిత కంటి శిబిరానికి వచ్చేసిన లబ్ధిదారులు వారి సహాయకులు పేదలకు అందరికీ అన్నదానం ఏర్పాటు చేయడం విశేషమని వారికి మాయొక్క సంఘం ద్వారా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు, కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్స్ :సునీల్,




జస్వంత్,ఆకాష్,

క్యాంపు కోఆర్డినేటర్ మల్లికార్జున రెడ్డి,ఉపాధ్యక్షుడు వహీద్, కోశాధికారి నరసింహులు, సభ్యులు మురళి, నాగార్జున, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు,

ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ సేవా కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రెడ్ బుక్ రాజ్యాంగానికి బెదిరే ప్రసక్తే లేదు

## కొరముట్ల శ్రీనివాసులు.

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్.**

రాష్ట్రంలో మంత్రి లోకేష్ కనుసన్నల్లో రెడ్ బుక్ పరిపాలన సాగుతోందని, ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వ అరాచక పాలనపై గల మెత్తిన వారిని తెలుగుదేశం గూండాలతో అణచివేయాలని ప్రయత్నిస్తే ఇక్కడ ఎవరు బెదిరిపోరని వైఎస్ఆర్సిపి రాష్ట్ర మాజీ విప్ రైల్వే కోడూరు నియోజకవర్గ ఇన్చార్జి కొరముట్ల శ్రీనివాసులు వారిని హెచ్చరించారు, ఈ సందర్భంగా ఆదివారం రైల్వే కోడూరు లోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కొరముట్ల మాట్లాడుతూ అందుకు సాక్ష్యం మంత్రిగా పనిచేసిన అంబటి రాంబాబుని దౌర్జన్యంగా ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా అరెస్ట్ చేయడమే కాకుండా తెలుగుదేశం గూండాలు ఆయన ఇంటిని ధ్వంసం చేయడమే సాక్ష్యమన్నారు, ప్రజాస్వామ్య సమాజంలో ఇంతటి అరాచకం, దుర్మార్గం దౌర్జన్యం జరుగుతుంటే రక్షించాల్సిన పోలీసులే ప్రేక్షక పాత్ర లో పోలీసులే సాక్ష్యంగా నిలవడం దిగ్భ్రాంతిని, ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదఅన్నారు, ఈ సాంప్రదాయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అన్నారు,

అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో లోకేష్ రెడ్బుక్ రాజ్యాంగం,రెడ్ బుక్ పరిపాలన జరుగుతుందని తనను అన్యాయంగా అరెస్ట్ చేసారని, తన కుటుంబంలోని మహిళలను భయభ్రాంతులకు గురి చేయాలని చూశారని ఈ



సంఘటనలు జరిగినప్పుడు డి.ఎస్.పి సీఐలు ఎస్సైలు పోలీస్ సిబ్బంది అక్కడే ప్రేక్షకుల వలె డ్రామా చూస్తున్నట్లు ఉన్నారని తెలుగుదేశం గుండాలు చేసిన విధ్వంసాన్ని పోలీసులు ఆపేందుకు ప్రయత్నించలేదని అన్నారు ఇలాంటి బెదిరింపులకునేను భయపడేది లేదని ఎంతమందిని అరెస్టు చేసిన ఎన్ని జైళ్లలో పెట్టినా తాము రెడ్బుక్ రాజ్యాంగానికి ప్రజాస్వామ్య బద్ధంగా వ్యతిరేకంగా పోరాడుతామన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు సంబంధించి అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్లో పేదలకు అనుకూలంగా న్యాయబద్ధంగా కేటాయింపులు జరగలేదని ఇది ప్రజలను మోసం చేయడమే అని కూటమి ప్రభుత్వం మాట ఇచ్చి ప్రజలను మోసగించడమేనని అంబటి రాంబాబు దుయ్యబట్టారు, ఉ కే సోషల్ మీడియా కార్యకర్త వివాహానికి విచ్చేసిన నాకు రైల్వే కోడూరు



నియోజకవర్గం ప్రజలు ఎంతటి ఆదరణ చూపినందుకు ధన్యవాదములు తెలుపుకుంటున్నాను అని అన్నారు 2012లో బై ఎలక్షన్ లో భాగంగా ఈ ప్రాంతానికి విచ్చేయడం జరిగిందని ఇటీవల కోటమి ప్రభుత్వం 18 రోజుల్లో రాజమండ్రి సెంట్రల్ జైల్లో అన్యాయంగా అరెస్టు చేసి పెట్టిందని వారి బెదిరింపులకు లొంగే ప్రసక్తి లేదన్నారు,ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ కెవ్వ శ్రీనివాస్ రెడ్డి సీనియర్ నాయకులు మాదినేని వెంకటరెడ్డి జెడ్పిటిసి రత్నమ్మ వైస్ ఎంపీపీ రెండు 2 శివయ్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండలయి రాఘవేంద్ర స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ నంద బాల సర్పంచ్ రామకృష్ణ పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రమేష్ ఎంపీటీసీ బండారు మల్లికార్జున నారాయణమ్మ అరుణ ఎంపీటీసీ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మాల నన్ను ఆశీర్వదించింది.



**-రేజింతల్ గణనాథుడు గట్టు ఎక్కించాడు.**

**-ప్రజలే కాకుండా దేవుళ్ళ ఆశీర్వాదం నిండుగా ఉంది.**

**-మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు).**



**అందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 22( రిపబ్లిక్ న్యూస్)**


అయ్యప్ప స్వామి మాల నన్ను ఆశీర్వదించింది , గణనాథుడు నన్ను గట్టెక్కించాడు, అని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) అన్నారు.ప్రజల ఆశీర్వాదమే కాకుండా దేవుళ్ళ దీవెనలు నిండుగా ఉన్నాయని ఆయన అన్నారు.అంతేకాకుండా ప్రజల సమస్యలు,నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు గాని , ప్రభుత్వ పథకాలు గాని ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానని వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) అన్నారు.

## నన్ను గెలిపించిన వార్డు ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

### 13వ వార్డ్ కౌన్సిలర్ బిఆర్ఎస్ అభ్యర్థి పట్లూరి శివశేఖర్ .

**ఆందోల్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 22( రిపబ్లిక్ న్యూస్)**

అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 13వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ మాట్లాడుతూ నన్ను గెలిపించిన కార్యకర్త , అక్క చెల్లెమ్మలు, అన్న తమ్ములకు ప్రత్యేక ధన్యవాదాలు అని తెలియజేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు మన వార్డు ప్రజలకు అందేలా చూస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నాకోసం గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు రాత్రి పగలు తేడా లేకుండా మీ సమస్యలు నా సమస్య అనుకోని మీకు కుటుంబంలో పెద్దకొడుకుల ఎప్పుడు నీ వెంటే ఉంటానని ఆయన అన్నారు. రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే అని మనకు మంచి రోజులు వస్తాయని కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ అన్నారు.



# ప్రమాదం అంచున నివాసం

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం -ప్రజల ప్రాణాలతో చెలగాటం

**కంజుమర్ కు నోటీసులు ఇవ్వకుండా.. తాత్సారం**

**33 కెవి హై ఓల్టేజ్ ఐరన్ స్తంభం అనుకోని ఇళ్లు**

**స్తంభం తొలగించేందుకు నానా అగచాట్లు**

**దిక్కు తోచక జుట్టు పీక్కుంటున్న విద్యుత్ అధికారులు**

**అధికారులు స్పందిచేరా .. ఆ ఇంటికి గండం గడిచేనా ..**




**రిపబ్లిక్ స్పెషలల్ స్టోరీ, ఫిబ్రవరి 22, అనంతపురం**
విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఓ ఇంటికి ప్రాణగండం పట్టుకుంది. 33 కెవి హై వోల్టేజ్ ఇనుప స్తంభం ఆనుకొని మూడంతస్తుల భారీ భవనాన్ని నిర్మించారు.

ఆ ఇంటి యజమాని పునాది నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడే విద్యుత్ అధికారులు నోటీసులు పంపాల్సి ఉంది. అయితే పునాది నిర్మాణాన్ని చూసి చూడనట్లు వదిలేసిన అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏకంగా హై వోల్టేజ్ విద్యుత్ ఇనుప స్తంభం ఆనుకొని భారీ భవన నిర్మాణం ఉంది. కన్స్యూమర్ ఇల్లు కన్స్ట్రక్షన్ చేసే ముందు విద్యుత్ అధికారుల పర్మిషన్ తీసుకోవాల్సి ఉంది. ఇవేవీ కన్స్యూమర్ ఆలోచించకుండా నిర్లక్ష్యంగా ఓ భవనాన్ని నిర్మించాడు. ఆ భవన నిర్మాణం అనుకొని హై వోల్టేజ్ విద్యుత్ స్తంభం ఉంది. ఆ భవనంలో నివసించే వారందరూ వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. వర్షాకాలంలో ప్రమాదవశాత్తు విద్యుత్ సంభవిస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వీటిని విద్యుత్ అధికారులు, సిబ్బంది గమనించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రాణాలు పోకముందే విద్యుత్ అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ లైన్ మెన్ నుంచి ఈఈలు, డిఈలు,ఎస్ సి ల వరకు ఏ అధికారి కూడా ఇంతవరకు పట్టించుకున్న పాపాన పోలేదు. విద్యుత్ అధికారులకు ప్రజల ప్రాణాలు అంటే లెక్క లేనితనం.

### ఏకంగా నాలుగు అంతస్తుల భారీ భవనం నిర్మాణం

అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామపంచాయతీ జగనన్న కాలనీలో 33 కెవి హై వోల్టేజ్ ఇనుప విద్యుత్ స్తంభానికి ఆనుకొని ఓ నాలుగు అంతస్తుల భవనం ఉంది. కన్స్యూమర్ నిర్లక్ష్యమో.. లేక
విద్యుత్ అధికారులు వైఫల్యమో ఏమో.. మరి.. ఏళ్ల తరబడి హై వోల్టేజ్ ఇనుప విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ అధికారులు గతంలోనే ఆ స్థలంలో పూడ్చారు. అయితే కన్స్యూమర్ ఇంటి నిర్మాణం చేపట్టే క్రమంలో విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేయాల్సి ఉంది. కన్స్యూమర్ ఇవేవీ పట్టించుకోకుండా ఏకంగా నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మించాడు. 33 కెవి హై వోల్టేజ్ స్తంభానికి దాదాపు 8 నుంచి 10 అడుగుల స్థలం వదిలిన తర్వాతనే ఇళ్ళు నిర్మించుకోవాల్సి ఉంది. కానీ వారు ఇంటి నిర్మాణం మొదలు పెడుతున్నప్పుడే అధికారులు స్పందించి ఉంటే... సమస్య తలెత్తేది కాదు. ఇంటి నిర్మాణం చేపట్టి ఏళ్ల గడిచినా అధికారుల నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తూ వచ్చారు. అందులో భాగంగా వర్షాకాలం మొదలైతే... ఆ భవనంలో నివసించేవారు ప్రమాదానికి గురైయ్యే అవకాశం ఉంది. వర్షాకాలంలో ప్రమాదవశాత్తు ఆ భవనానికి విద్యుత్ సంభవిస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వీటిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ అధికారులు కన్స్యూమర్ పైశాఖపరమైన చర్యలు చేపట్టి ఇనుప విద్యుత్ స్తంభం తొలగించాల్సి ఉంది.

### అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు గాలిలో కలవాల్సిందే

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు అధికారుల వ్యవహారం కూడా అలాగే ఉంది. ఇంటి నిర్మాణం చేపట్టేటప్పుడే కన్స్యూమర్ కి నోటీసులు ఇచ్చి ఉంటే.. ఈరోజు అధికారులు ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండేది కాదు. ఏళ్ల తరబడి ఉన్న స్తంభం పక్కనే భవన నిర్మాణం చేపట్టేటప్పుడు అధికారులు ఎందుకు స్పందించలేదో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. లైన్ మెన్ దగ్గర నుంచి ఏఈలు, ఈడీలు, ఇలా వరుసగా విద్యుత్ కార్యాలయం ఎస్ సి ల వరకు అధికారులు ఏ ఒక్కరూ స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. విద్యుత్ శాఖ కార్యాలయాలలో ఏ ఒక్క అధికారి కూడా స్పందించరు.

ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నటువంటి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు గాలిలో కలిసి పోవాల్సిందేనా... వీటికి ఎవరు బాధ్యత వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. 33 కెవి హై వోల్టేజ్ ఇనుప విద్యుత్ స్తంభం తొలగించేందుకు ఇప్పటికీ అధికారులు నానా అగచాట్లు పడుతున్నారు. అధికారులను అడిగితే చూస్తాం,చేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప.. పూర్తిస్థాయిలో అధికారులు పని చేయడం లేదు. పోనీ డీఈ లను అడిగితే ఫీల్డ్ లో ఉన్నాం.. లైన్ మెన్ ను పంపి విచారణ చేపిస్తాం అంటారే తప్ప ఏ ఒక్క అధికారి కూడా స్పందించకుండా ఉన్నారు.



### మామూళ్ల మత్తులో ప్రభుత్వ ఆదాయానికి గండి

పొరపాటు పడ్డారా ... పొరపాటు చేశారా అనేది పక్కన పెడితే.. జరిగిన పొరపాటే... అధికారుల అలసత్వం ఇట్టే అర్థమవుతుంది. ఏ అధికారి, ఎప్పుడు ఫీల్డ్ కి వెళ్తారో తెలియని పరిస్థితి విద్యుత్తు శాఖలో కనబడుతోంది. ఏ అధికారి ఎన్ని రోజులు లీవ్ లో ఉంటారో కూడా తెలియని పరిస్థితి. ఏ అధికారి కార్యాలయానికి ఎప్పుడు వస్తారో అర్థం కాని పరిస్థితి అనంతపురం విద్యుత్ శాఖలో ఏర్పడింది. అనేకమార్లు విద్యుత్ కార్యాలయాలలో అధికారులు కనిపించరు.. సిబ్బందిని అడిగితే ఎప్పుడొస్తారో మాకే తెలీదు అంటూ జవాబు ఇస్తారు. పోనీ అధికారులు ఉన్నప్పుడు సమస్య తీవ్రతను తెలియజేస్తే... చేస్తామనే చెప్తారు కానీ చెయ్యరు. అదే విద్యుత్ అధికారుల మాయాజాల మాటలు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ వ్యక్తిగత ఆదాయానికి మొగ్గు చూపుతున్నారు.
షరా మామూళ్లకే అలవాటు పడ్డ అధికారులు అడ్డగోలు సంపాదనకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారు.

### ఇప్పటికైనా అధికారులు స్పందిచేరా

అంతా మా ఇష్టం అనే ధోరణిలో అనంతపురం విద్యుత్ కార్యాలయంలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పనిచేయాల్సిన అధికారులే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బాధ్యత గల అధికారులే విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారు. తమకేమీ పట్టనట్లు ఉన్నారు. దీంతో సమస్య సమస్యగానే మిగిలింది తప్ప. సమస్యకు పరిష్కారం చూపే దిశగా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఉన్న సమస్య తీరుతుందో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. కన్స్యూమర్ ఏర్పాటు చేసిన భారీ బిల్డింగ్ పై హై వోల్టేజ్ విద్యుత్ తీగలు ఉండడం వల్ల వర్షాకాలంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. వీటిని గమనించిన అధికారులు సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే పని ఒత్తిడి కారణంగానా .. లేక ఇతర కారణాల చేతనో .. అధికారులు హై వోల్టేజ్ విద్యుత్ స్తంభాన్ని తొలగించేందుకు దిక్కు తోచక జుట్టు పీక్కునే పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందిచేరా లేదా అన్నది ప్రశ్నార్థకంగానే మిగిలింది.

## ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన గడికోట శ్రీకాంత్ రెడ్డి

### గ్రామాల్లోని ఆలయాలు గ్రామ ప్రజల ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీక..







**అన్నమయ్య జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 22 - (రిపబ్లిక్ న్యూస్) -** మదనపల్లి :- రామాపురం మండల కేంద్రమైన సుద్దమల్ల గ్రామం ఓబుల్ రెడ్డిగారిపల్లె దిగువ హరిజనవాడలో నిర్మాణ దశలో ఉన్న శ్రీ సీతా సమేత కోదండ రామాలయాన్ని ఆదివారం స్థానిక ప్రజలతో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షల నిధులను మంజూరు చేయించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను పరిశీలించిన గడికోట శ్రీకాంత్ రెడ్డి నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా త్వరతగతిన పూర్తి చేయాలని మేస్త్రీకి సూచించారు. గ్రామాల్లోని ఆలయాలు పల్లె వాతావరణానికి గ్రామ ప్రజల ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీకనని ఆయన పేర్కొన్నారు.

**దిగువ హరిజనవాడ వాసులతో శ్రీకాంత్ రెడ్డి మమేకం..**
సొంత గ్రామంలోని దిగువ హరిజనవాడకు విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి దళితులు ఘన స్వాగతం పలికారు. పెద్దలు, యువత, మహిళలు హర్షధ్వానాలతో స్వాగతించారు. యువత కేరింతలు కొడుతూ డప్పులు వాయిస్తూ పూలు పరుస్తూ పూలహారాలతో గజమాలతో ఆయనను ఆహ్వానించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరిస్తూ, వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ మమేకమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక దళితులు మాట్లాడుతూ గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం తమ అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేసిందని గుర్తుచేశారు. గ్రామంలోని ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం పట్ల శ్రీకాంత్ రెడ్డి కి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.






## నూతన వధూవరులను ఆశీర్వదించిన

### మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి

### తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

**గుత్తి ఫిబ్రవరి 22( రిపబ్లిక్ న్యూస్)**గుత్తి పట్టణం తాడిపత్రి రోడ్ స్పంద న ఫంక్షనల్ నందు యాడికి మండలం మాజీ జడ్పీటీసీ,స్టేట్ జాయింట్ సెక్రెటరీ వైయస్సార్ సిపి వెన్నపూస వెంకట్రామిరెడ్డి ఆహ్వానం మేరకు కుమారుడు కురుణారెడ్డి చరిత వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వై యస్సార్ సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, గుంతకల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మరియు సమన్వయ కర్త వై.వెంకటరామిరెడ్డి,తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి,మ రియు పత్తికొండ మాజి ఎమ్మెల్యే కం గాటి శ్రీదేవి, హర్షవర్ధన్ రెడ్డి,గోకలనాథ్ రెడ్డి,నార్పల సత్యనారాయణ మాజీ మార్కెట్ యా ర్డ్ చైర్మన్,రాయలచెరువు సివి రమణా రెడ్డి పారి శ్రామికవేత్త,యాడికి రమేష్ ,వెన్నుపూసల రవీంద్రారెడ్డి గుత్తి వైసిపి నాయకులు పీరా గోవర్ధన్ రెడ్డి,ప్రవీణ్,సుబ్బారెడ్డి, వరదరాజులు గుత్తి పట్టణం మరియు మండల వైయస్సార్ సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నా రు.



# పెట్రేగిపోతున్న ఇసుక మాఫియా..

**వీళ్లకు హద్దు అదుపు లేక పాయే..!**

**కక్కుర్తి కాసులకు అలవాటుపడ్డ సంబంధిత అధికారులు..**

**చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న వైనం..**



**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 22 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- వీరబల్లి మండల కేంద్రంలో అక్రమ ఇసుక తవ్వకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని ఇసుక మాఫియా బహిరంగంగానే తమ దందాను కొనసాగిస్తోంది. ప్రధానమైన మాండవ్య నదిలో ఇసుక మాఫియా అక్రమంగా ఇసుకను తోడేస్తున్నది. మాండవ్య నది బ్రిడ్జిల సమీపంలో యదేచ్ఛగా జేసీబీలతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో ఎత్తివేత జరుగుతుండడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. నదిలో సహజ ప్రవాహాన్ని దెబ్బతీసేలా భారీ యంత్రాలతో తవ్వకాలు జరపడం వల్ల భవిష్యత్తులో బ్రిడ్జిలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. పట్ట పగలే పుల్లగూర గండి వద్ద జేసీబీలతో పెద్ద ఎత్తున ట్రాక్టర్లలో ఇసుక రావణా జరుగుతున్నా సంబంధిత అధికారులు మామూళ్లకు మరిగి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి· మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం పనిచేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ఉన్న అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని నదిని కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఈ దందా మరింత విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**రాజకీయ, అధికార అండదండలు..**

స్థానిక నేతలు, కొందరు పోలీస్/రెవెన్యూ అధికారులతో లింకులు ఉండటం వల్ల మాఫియా అడ్డు అదుపు లేకుండా చెలరేగిపోతోంది. ఉచిత ఇసుక విధానం ఉన్నప్పటికీ, అక్రమార్కులు పదివేలకు కొని యాభైవేలకు అమ్ముతూ సామాన్యులపై భారం వేస్తున్నారు.

**దాడులు/బెదిరింపులు..**

ఇసుక దందాను ప్రశ్నించేవారిపై, జర్నలిస్టులపై కూడా దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టినా, మాఫియా నెట్‌వర్క్ బలంగా ఉండటంతో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడం సవాలుగా మారింది. అయితే డబ్బులకు కక్కుర్తి పడి సంబంధిత అధికారులు ఇసుక మాఫియాకు అండగా ఉంటూ ఇసుకను తరలించడంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా చేస్తున్నట్టు చుట్టుపక్కల గ్రామస్తులు ఆరోపిస్తున్నారు..

## సోమవారంప్రజా సమస్యల పరిష్కార వేదిక

**అర్జీలు ఆన్లైన్లో లో నమోదు చేసుకోవచ్చు -సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి, 22 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
(సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా,ఆన్లైన్‌లోద్వారాకూడా సమర్పించవచ్చన్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు.అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు.అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.


## ఆర్ ఆర్ డి కంపెనీ ప్రారంభోత్సవం కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పేర్ని నాని. మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ రిపోర్టర్ బుచ్చయ్య.



**ఆందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 22( రిపబ్లిక్ న్యూస్)**
అందోల్ మండల్ పోసానిపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ ఆర్ డి డిస్టలరీ కంపెనీ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పేర్ని నాని కి మర్యాదపూర్వకంగా రిపబ్లిక్ రిపోర్టర్ బుచ్చయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.

## పోలీస్ కార్యాలయంలో ఉయ్యాలవాడ వర్ధంతి





**నంద్యాల క్రైమ్ ఫిబ్రవరి 22- రిపబ్లిక్ న్యూస్**
నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1857 స్వాతంత్ర్య సమరానికి ముందే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన తొలి తెలుగు వీరుల్లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఒకరని పేర్కొన్నారు. పాలెగాళ్ల వ్యవస్థ రద్దుకు వ్యతిరేకంగా, కోయిలకుంట్ల ఘటన అనంతరం 66 గ్రామాల ప్రజల కోసం ఆంగ్లేయులపై పోరాటం ప్రారంభించారని తెలిపారు. 1847లో ఆయన వీరమరణం పొందినా, దేశభక్తి, ధైర్యసాహసాలు చరిత్రలో నిలిచిపోయాయని అన్నారు.కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు, మంజునాథ్, సురేష్ బాబు, ఆర్ఎస్ఐలు కాళీ, శ్రీచరణ్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

**జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్**





**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి 22 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):**
ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగం యువతకు స్ఫూర్తిదాయకమని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్వాతంత్ర్య సమరయోధుల్లో ఒకరైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179వ వర్ధంతి కార్యక్రమ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 1806 నవంబర్ 24న నంద్యాల జిల్లాలోని రూపనగుడి గ్రామంలో జన్మించారన్నారు. 1857 తొలి భారత స్వాతంత్ర్య సమరానికి పదేళ్ల ముందుగానే, 1846 సంవత్సరంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దోపిడీ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం ప్రారంభించిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డిన్నారు. ఆయన తిరుగుబాటు 1847 ఫిబ్రవరి 22న ఆయన వీరమరణంతో ముగిసినా, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రేరణగా నిలిచిందన్నారు. 1846లో కోయిలకుంట్ల ఖజానాపై దాడి చేసి బ్రిటిష్ అధికారాన్ని సవాలు చేసారని తెలిపారు. రుద్రవరం వెళ్లే దారిలో ఒక అటవీ అధికారిని హతమార్చిన ఘటన బ్రిటిష్ సర్కార్‌ను కుదిపేసిందన్నారు. అనంతరం బ్రిటిష్ సైన్యం ఆయన కుటుంబ సభ్యులను బంధించగా, వారిని రక్షించేందుకు నల్లమల అటవీ ప్రాంతానికి నరసింహారెడ్డి వెళ్లారన్నారు. చివరికి కోయిలకుంట్లలో అరెస్టై, 1847 ఫిబ్రవరి 22న ఆయనను ఉరితీశారన్నారు. బ్రిటిష్ పాలకులు సంప్రదాయ వ్యవసాయ వ్యవస్థలో చేసిన మార్పులు, అధిక పన్నుల విధానం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయన్నారు. బ్రిటిష్ వారికి నేరుగా పన్ను చెల్లించడానికి నిరాకరించిన నరసింహారెడ్డి, తన పెన్షన్ విషయమై పంపిన వినతిపత్రానికి కోయిలకుంట్ల తహాశీల్దార్ అవమానకరంగా స్పందించడం కూడా తిరుగుబాటుకు దారితీసిందని డిఆర్ఓ తెలిపారు.

# రైస్ పుల్లింగ్ పేరుతో భారీ మోసాలు

**లక్షల రూపాయలను వసూలు చేస్తున్న డీకే బాబు**

**నగదు, బ్లాక్ ఫార్చునర్, మూడు ఫోన్లు స్వాధీనం**

**అరెస్ట్ చేసి కేసు వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి**



**రిపబ్లిక్ క్రైమ్, ఫిబ్రవరి 22, శ్రీ సత్య సాయి జిల్లా**
శ్రీ సత్య సాయి జిల్లా కదిరి రైస్ పుల్లింగ్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న తలుపుల మండలానికి చెందిన చింతకుంట క్రిష్ణారెడ్డి అలియాస్ డీకే బాబు (44)ను అరెస్టు చేసినట్లు కదిరి డీఎస్పీ శివన్నారాయణ స్వామి తెలిపారు. ఆదివారం కదిరి రూరల్ పోలీస్ స్టేషన్లో సీఐ నాగేంద్రతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.డీఎస్పీ వివరాల ప్రకారం, డీకే బాబు "రైస్ పుల్లింగ్ మహిమ గల రాగి చెంబు" తయారు చేసే విద్య ఉందని, దాన్ని మార్కెట్లో కోట్ల రూపాయలకు అమ్మవచ్చని చెప్పి ఫిర్యాదిదారుడిని నమ్మబలికాడు. ఈ క్రమంలో 2025 జూన్ లో రూ.5 లక్షలు, అదే సంవత్సరం జూలైలో మరో రూ.5 లక్షలు తీసుకున్నాడు. తర్వాత మరిన్ని డబ్బులు కోరడంతో అనుమానం వచ్చిన ఫిర్యాదిదారు తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు.ఈ నేపథ్యంలో ముద్దాయి తన ఇంటికి రావాలని చెప్పి ఒక రాగి చెంబు ఇచ్చి కొంతకాలం తర్వాత అమ్మిస్తానని చెప్పాడు. అనంతరం 2026 ఫిబ్రవరిలో ఫిర్యాదిదారు డబ్బులు కోరగా, ముద్దాయి బెదిరింపులకు పాల్పడి అతన్ని ఇంట్లో బంధించి కత్తితో ప్రాణహాని చేస్తానని బెదిరించి, ఫిర్యాదిదారి స్నేహితుల ద్వారా రూ.3 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే మిగిలిన రూ.7 లక్షల కోసం బలవంతంగా ప్రామిసరీ నోట్ల పై సంతకం చేయించుకున్నాడని వెల్లడించారు.ఫిర్యాదు మేరకు తలుపుల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.శనివారం అందిన సమాచారంతో కదిరి రూరల్ సర్కిల్ సీఐ, తలుపుల ఎస్ఐ సిబ్బందితో కలిసి తనకల్లు మండలం రాకుంటపల్లి సమీపంలోని కొక్కంటి క్రాస్ - మహమ్మదాబాద్ క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో ఏపి-40-కెఎఫ్-2349 వస్తున్న డీకే బాబును గుర్తించి సాయంత్రం 5.30 గంటలకు అరెస్టు చేశారు.ముద్దాయి వద్ద నుంచి బ్లాక్ ఫార్చునర్ వాహనం, మూడు సెల్ఫోన్లు, రూ.1,08,940 నగదు, ఐదు రాగి చెంబులు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై గతంలో కూడా పలు కేసులు నమోదై రౌడీ షీటర్ గా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మీడియా సమావేశంలో సీఐ నాగేంద్ర, తలుపుల ఎస్ఐ చెన్నయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 55 గదుల వసతి సముదాయము నిర్మించుటకు భారీ విరాళం ..

**1 కోటి 25 లక్షలు విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చిన NRI..**



**మహానంది, ఫిబ్రవరి 22,( రిపబ్లిక్ న్యూస్)** మహానందీశ్వర స్వామి దేవస్థానం నందు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న 55 గదుల వసతి సముదాయమునకు మొదటి అంతస్తు నిర్మించుటకై ముందుకు వచ్చిన NRI. మహానంది పుణ్యక్షేత్రం నందు నూతనంగా నిర్మిస్తున్న వసతి సముదాయంనకు మొదటి అంతస్తుకు రూ .1 కోటి 25 లక్షలు ఇవ్వడాని ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం ఆలయ కార్యనిర్వహణ అధికారి నల్లకాలువ శ్రీనివాస రెడ్డి కి దాత సరోజినీ వడ్లమూడి NRI వీరి తల్లిదండ్రులు కీ.శే.శ్రీ వీరమాచినేని వీర రాఘవయ్య మరియు కీ.శే. శ్రీమతి వి. నాగభూషణమ్మ జ్ఞాపకార్థం ముందుగా 65 లక్షల విలువ గల చెక్కును అందజేశారు. అనంతరం దేవస్థానం అర్చకులు దాతకు వేద ఆశీర్వచనం నిర్వహించి శ్రీ స్వామివారి శేషవస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల మధు, సీనియర్ అసిస్టెంట్ జగదీష్, ఉప ప్రధాన అర్చకులు శ్రీ శివ శంకరయ్య శర్మ, ముఖ్య అర్చకులు శ్రీ మాణిక్య శర్మ, అర్చకులు శ్రీ మణికంఠ శర్మ పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com